Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం

భయమెరుగని సాహసంతో
వ్యక్తి జీవించాలి.
మత సిద్ధాంతాలతో
వ్యక్తి మనసు
పాడు చేసుకోకూడదు.
- స్వామీ వివేకానంద

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 199 విశాఖపట్నం, 22 మే 2025 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00




## అట్టహాసంగా యోగాంధ్ర వేడుకలు ప్రారంభం

మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసోత్సవం నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు విశాఖ ఆర్కే బీచ్ వద్ద బుధవారం ఉదయం అట్టహాసంగా యోగాంధ్ర వేడుకలు ప్రారంభించారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తదితరులు పాల్గొంటారు. వివరాలు 8లో



# యోగాకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని మోదీ

- సీఎం చంద్రబాబు

యోగాంధ్ర' వెబ్‌సైట్ ప్రారంభం



**అమరావతి, విశాఖ సమాచారం:** యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఉండవల్లిలో బుధవారం 'యోగాంధ్ర' వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో నిర్వహించుకునే కార్యక్రమం యోగా అన్నారు. ఇది కొద్ది మందికో, కొన్ని ప్రాంతాలకో పరిమితమైంది కాదని.. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరమని పేర్కొన్నారు. అందరి జీవితాల్లో యోగా భాగం కావాలన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కావాలంటే దీన్ని సాధన చేయాలని సూచించారు. "ఫొటోలు, ఈవెంట్ కోసం ఒకరోజు చేసే కార్యక్రమం కాదిది. ప్రతిఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమమిది. జీవనశైలిలో భాగమయ్యేలా యోగాను ముందుకు తీసుకెళ్లాలి. నేటి నుంచి నెలపాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తున్నాం. కనీసం 2 కోట్ల మందికి తక్కువ కాకుండా పాల్గొనాలన్నది సంకల్పం. కనీసం 10 లక్షల మందికిపైగా యోగా సర్టిఫికెట్లు ఇవ్వాలనేది లక్ష్యం. జూన్ 21న విశాఖలో 5 లక్షల మందితో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు కార్యక్రమం చేపడతాం. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిద్దాం. విశాఖలో జరిగే యోగా ఈవెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారు. పాఠశాలల్లోనూ ఇక నుంచి రోజూ ఒక గంట యోగా ఉంటుంది" అని చంద్రబాబు తెలిపారు.

- మరో 27 మంది మావోయిస్టులు హతం
- ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్
- భద్రతా బలగాలకు ప్రధాని అభినందనలు

# మావోయిస్టు అగ్రనేత కేశవరావు మృతి



**నారాయణపూర్ / బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య బుధవారం ఉదయం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు/ గంగన్నతో సహా 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడిరచారు. మరి కొంత మంది గాయపడ్డారు. మాధ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ డీఆర్జీ బలగాలు పాల్గొన్నాయి. బుధవారం ...(మిగతా 2లో)

### నక్సలిజం నిర్మూలనలో ఇదో మైలురాయి : అమిత్ షా

"నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవ రాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి ...(మిగతా 2లో)

## షర్మిల నిరాహార దీక్ష ప్రారంభం

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమాలు చేస్తామని వెల్లడి

సమ్మె చేస్తున్న కార్మికులకు కాంగ్రెస్ మద్దతు



**గాజువాక, విశాఖ సమాచారం:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల బుధవారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. స్టీల్ ప్లాంట్ లో విధుల నుంచి తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఇతర డిమాండ్లను కూడా యాజమాన్యం పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు మద్దతుగానే తాను నిరాహార దీక్షకు దిగినట్లు తెలిపారు. బుధవారం ఉదయం హైదరాబాద్ ...(మిగతా 2లో)



## ఏపీకి ఆరు కుంకీ ఏనుగులు అప్పగించిన కర్ణాటక

**బెంగళూరు :** ఏపీకి ఆరు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకీ ఏనుగుల అప్పగింత, వాటి సంరక్షణకు సంబంధించిన డాక్యుమెంట్లను పవన్‌కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కుంకీ ఏనుగులు ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి, సీఎం సిద్ధరామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సాయం అడిగినా కర్ణాటక ప్రభుత్వం ముందు కొస్తోందన్నారు. ఏపీ, కర్ణాటక మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని పవన్ ఆకాంక్షించారు. కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీ, కర్ణాటక మధ్య 9 ఒప్పందాలు కుదుర్చు కున్నామన్నారు. పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగులను ...(మిగతా 2లో)

## కుప్పంలో గంగమ్మకు సారె సమర్పించిన సీఎం దంపతులు





**కుప్పం:** ఏపీ సీఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తున్నారు. సతీమణి నారా భువనేశ్వరితో కలిసి బుధవారం ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో ఆయన పాల్గొన్నారు. సీఎం దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారి విశ్వరూప దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు దంపతులు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రానికి మంచి జరగాలని సీఎం ప్రార్థించారు. మరోవైపు అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ దర్శనం కల్పిస్తారు.

## పాక్‌పై దౌత్యయుద్ధం మొదలు


(సంజయ్ ఝా బృందం)


**ఢిల్లీ:** సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తోన్న ప్రోత్సాహాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడానికి ఏర్పాటుచేసిన అఖిలపక్ష బృందాల పర్యటన బుధవారం ప్రారంభమైంది. జేడీయూ ఎంపీ సంజయ్ ఝా, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని రెండు బృందాలు ఈరోజు విదేశాలకు బయల్దేరారు. సంజయ్ బృందం జపాన్‌కు బయల్దేరగా.. రాత్రి తొమ్మిది గంటల సమయంలో యూఏఈకి శిందే టీమ్ ప్రయాణం మొదలుపెట్టనుంది.

సంజయ్ బృందంలో బిజెపి ఎంపీలు అపరాజితా సారంగి, బ్రిజ్‌లాల్, హేమాంగ్ జోషి, ప్రధాన్ బారువా, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ బెనర్జీ, సీపీఎంకు చెందిన జాన్ బ్రిట్టాస్, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, మాజీ దౌత్యవేత్త మోహన్ కుమార్ సభ్యులుగా ఉన్నారు. వారు ఇండోనేసియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లలో పర్యటించ నున్నారు. ఇక శిందే బృందం.. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సియెర్రా లియోన్, లైబీరియా వెళ్లనుంది.

**ఆ 33 దేశాలే ఎందుకు..?**

వివిధ పార్టీలకు ...(మిగతా 2లో)

## అప్పన్న ఆలయ ప్రధానార్చకుడు రమణాచార్యులు కన్నుమూత



**సింహాచలం, విశాఖ సమాచారం:** శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి దేవాలయ ప్రధానార్చకుడు 2 ఇరగవరపు రమణాచార్యులు (58) గుండెపోటుతో మరణించారు. రెండు రోజుల కిందట ఆసుపత్రిలో ...(మిగతా 2లో)

## విశాఖలో సెమీ రింగ్‌రోడ్డు

మంత్రి నారాయణ వెల్లడి



**విశాఖపట్నం. విశాఖ సమాచారం:** భోగాపురం ఎయిర్‌పోర్టు వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి అవుతుందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేస్తూ 22 రోడ్లు ప్రతిపాదించామని, వాటిలో 15 రోడ్లు పూర్తి అవుతున్నాయని తెలిపారు. 115 రోజుల్లో మిగిలిన ఆరు రోడ్లకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసి, జాతీయ రహదారి సంస్థతో సమన్వయం చేసుకొని పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులపై మంత్రి మీడియాతో మాట్లాడారు. "టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలంటే రూ. 7వేల కోట్లు కావాలి. వైసీపీ హయాంలో ...(మిగతా 2లో)


# సెలవుల్లో పనిచేయడానికి లాయర్లు ఇష్టపడటం లేదు

## సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్



**ఢిల్లీ:** కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్న అంశంపై భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. లాయర్లు సెలవు దినాల్లో పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. వేసవి సెలవుల అనంతరం తన కేసును విచారించాలని ఓ న్యాయవాది కోరారు. సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనానికి ఆ అభ్యర్థన ఆగ్రహం తెప్పించింది. "న్యాయమూర్తులు సెలవుల్లో పనిచేస్తున్నారు. అయినా సరే పెండింగ్ కేసుల విషయంలో మమ్మల్ని నిందిస్తున్నారు. కానీ, సెలవుల్లో పనిచేయడానికి ఇష్టపడనిది న్యాయవాదులే" అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో పనిచేసే ధర్మాసనాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. భారత 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ గతవారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. 2019 మే 24న ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఆరేళ్లలో సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. 370 అధికరణం రద్దు, ఎన్నికల బాండ్ల రద్దు, పెద్దనోట్ల రద్దు, ఎస్సీల వర్గీకరణ వంటి అనేక సంచలనాత్మక కేసులలో తీర్పులు వెలువరించారు. సీజేఐగా ఆయన ఈ ఏడాది నవంబరు 23 వరకు కొనసాగుతారు.

# ఏపీ ఆర్థిక శాఖ ప్రధాన కార్యాలయంలో అగ్నిప్రమాదం



**మంగళగిరి, విశాఖ సమాచారం:** ఏపీ ఆర్థిక శాఖ ప్రధాన కార్యాలయమైన నిధి భవన్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఉద్యోగులంతా విధుల్లో ఉండగానే భవనం రెండో అంతస్తులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు 300 మంది ఉద్యోగులు భయంతో కిందికి పరుగులు తీశారు. సెంట్రల్ ఏసీలో షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. ఈ ప్రమాదంతో కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, దస్త్రాలు కాలిపోయి ఉండవచ్చని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల జీతభత్యాలు, వివిధ శాఖలకు సంబంధించిన లావాదేవీల బిల్లులు ఉండటంతో ఎంత నష్టం జరిగిందనేది ఇంకా అంచనా వేయలేదు. ఆన్‌లైన్ సిస్టం అయినప్పటికీ కంప్యూటర్లు కాలిపోవడం వల్ల లావాదేవీలకు సంబంధించిన పూర్తి సమాచారం మంటల్లో కాలిపోయి ఉండవచ్చని ఉద్యోగులు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మినహా ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు.

**పరిశీలించిన మంత్రి పయ్యావుల**

నిధి భవన్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సకాలంలో స్పందించడంతో ఎలాంటి నష్టం జరగలేదని మంత్రి తెలిపారు.

# 'పాక్‌లో నన్ను పెళ్లి చేసుకో'

## జ్యోతి మల్హోత్రా చాటింగ్ లీక్



**ఢిల్లీ :** పాకిస్థాన్‌కు గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పాక్‌లో వివాహం చేసుకునేందుకు ఆమె సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఐఎస్ఐతో సంబంధాలున్న హసన్ అనే వ్యక్తితో ఆమె గతంలో చేసిన చాటింగ్ వివరాలు తాజాగా బయటకొచ్చాయి. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న అలీ హసన్‌తో ఆమె నిరంతరం టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కోడ్ భాషలో ఎన్నో విషయాలు మాట్లాడుకునేవారు. తాజాగా అవన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తనను పాకిస్థాన్‌లోనే వివాహం చేసుకోవాలని జ్యోతి కోరింది. దీంతో పాటు భారత్‌కు సంబంధించిన రహస్య కార్యకలాపాల గురించి కూడా చర్చించారు. అంతేకాకుండా ఆమెకు నాలుగు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని.. దుబాయ్ నుంచి వాటిలో డబ్బు జమ అవుతోందని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా విచారణ కొనసాగుతోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. భారత్‌కు వచ్చిన తర్వాత కూడా అతడితో కాంటాక్టు అయినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అతడి సూచన మేరకు.. అలీ అనే వ్యక్తిని ఆమె కలిసింది. అతడు పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను జ్యోతికి పరిచయం చేసినట్లు సమాచారం. దేశ రక్షణకు చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ఆమె పాక్ వ్యక్తులకు చేరవేసినట్లు అధికారులు ఆరోపించారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా భారత్‌లో నిలిపివేశారు. పాక్ హైకమిషన్‌కు చెందిన వ్యక్తితో ఆమె వివాహానికి సంబంధించిన చాటింగ్ వివరాలు బయటకొచ్చాయి.

# కేశవరావు మృతి వార్త అవాస్తవం : ఏపీ పౌరహక్కుల సంఘం

**విజయవాడ :** మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ అలియాస్ గంగన్న మృతిపై వస్తున్న వార్తలను ఏపీ పౌరహక్కుల సంఘం ఖండించింది. ఆయన క్షేమంగా ఉన్నారని, ఎన్కౌంటర్లో గంగన్న చనిపోయారని వస్తున్న వార్తలు అవాస్తవం అని ప్రకటించింది. ఈ మేరకు ఏపీ పౌరహక్కుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ లో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మృతుల్లో మావోయిస్ట్ పార్టీ జనరల్ సెక్రెటరీ నంబాల కేశవరావు కూడా ఉన్నట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. అందుకు సంబంధించిన ఫోటో కూడా బయటికి వచ్చింది.

# పాక్‌పై దౌత్యయుద్ధం మొదలు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఎంపీలు, మాజీ ఎంపీలతో కూడుకున్న ఏడు బృందాలను ఏర్పాటుచేయగా వాటిలో మూడింటికి మంగళవారం విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ పలు అంశాలను వివరించారు. అలాగే ఈ బృందాలు పర్యటించనున్న 33 దేశాలను దేని ఆధారంగా ఎంచుకున్నారో వివరించారు. ఆ విషయాన్ని భాజపా ఎంపీ అపరాజితా సారంగి మీడియాకు వెల్లడించారు. "ఆ 33లో 15 ఐరాస భద్రతామండలిలో సభ్యదేశాలు (5 శాశ్వత, 10 తాత్కాలిక సభ్యదేశాలు). మరికొన్ని భవిష్యత్తులో భద్రతా మండలిలో చేరబోయే దేశాలు" అని తెలిపారు. అలాగే అంతర్జాతీయ అంశాలపై భారత వాణిని వినిపించే దేశాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇక, తమ అంతర్జాతీయ పర్యటనల్లో భాగంగా ఈ బృందాలు ఆయా దేశాల ప్రభుత్వాధినేతలతోపాటు పార్లమెంటేరియన్లు, మేధావులు, మీడియా సభ్యులను కలుస్తారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత బలగాలు 'ఆపరేషన్ సిందూర్' రూపంలో ఉగ్రస్థావరాలపై ఉక్కుపాదం మోపాయి. పీఓకే, పాక్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశాయి. తర్వాత పాక్ రెచ్చగొట్టే చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈ దౌత్య యుద్ధాన్ని ప్రారంభించింది.

# అప్పన్న ఆలయ ప్రధానార్చకుడు రమణాచార్యులు కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

చేరిన ఆయన చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు సింహాచలలేశుని పూజాది కైంకర్యాలలో విశేష సేవలందించిన రమణాచార్యులు అకాల మరణం పట్ల సింహాచలం దేవస్థానం ఉద్యోగులతో పాటు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. 98 వార్డు పద్మావతి నగర్ లో నివాసముంటున్న ఆయన ఇంటికి వెళ్ళి మృతదేహాన్ని పలువురు సందర్శించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సింహాద్రినాథుడు కుటుంబ సభ్యులకు ధైర్యాన్నివ్వాలని ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో లు ఎన్ ఆనంద్ కుమార్, పిల్లా శ్రీనివాస్, మాజీ దర్మ కర్తలు గంట్ల శ్రీను బాబు, సూరిబాబు, కప్ప స్తంభము నాయుడు, ప్రసాద్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అడవివరం శ్మశాన వాటికలో అంత్య క్రియలు నిర్వహించారు.

# ఏపీకి ఆరు కుంకీ ఏనుగులు అప్పగించిన కర్ణాటక

(మొదటి పేజీ తరువాయి)



నియంత్రించేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించుతారు.

**కుంకీ ఏనుగులు ఏం చేస్తాయ్?**

కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఎక్కడైనా ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగులను తరిమికొట్టడంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కొన్నిసార్లు గాయపడిన లేదా చిక్కుకున్న అడవి ఏనుగును రక్షించడానికీ వీటిని ఉపయోగిస్తారు. సాధా రణంగా కుంకీ పార్టీలకు ఏనుగులుగా మగవాటినే ఎంపిక చేసుకుంటారు. ఎందుకంటే ఇవి మాత్రమే ఒంటరిగా సంచరిస్తుంటాయి. వీటిని బంధించి కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారు. తర్వాత ఆపరేషన్ల కోసం వాడుతుంటారు. ఏనుగుల గుంపును అడవిలోకి తిరిగి పంపించేంత వరకు ఇవి విశ్రమించవు. కొన్నిసార్లు పంట పొలాలపైకి వచ్చిన ఏనుగులతో ఇవి తలపడాల్సి ఉంటుంది కూడా. అందుకే పోరాడడంలోనూ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

# అమెరికా సుంకాల ప్రభావాన్ని తట్టుకునే స్థితిలో భారత్

## ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్



**న్యూయార్క్:** అమెరికా సుంకాల ప్రభావం, ప్రపంచ వాణిజ్య అంతరాయాల ప్రతికూలతలను తట్టుకునే స్థితిలోనే భారత్ ఉందని ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ తెలిపింది. దేశీయ వృద్ధికి ప్రోత్సాహకాలు, ఎగుమతులపై తక్కువ ఆధారపడటం తదితర అంశాలే అందుకు కారణమని వివరించింది. భారత్‌లో తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి, ప్రైవేట్ వినియోగాన్ని పెంచడానికి, మౌలిక సదుపాయాల కల్పనపై వ్యయాన్ని పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు దోహదం చేస్తున్నాయని మూడీస్ వెల్లడించింది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, ఆర్థిక వ్యవస్థను మరింత ప్రోత్సహించడానికి వడ్డీ రేట్ల తగ్గింపు లాంటి చర్యలు చేపడుతోందని తెలిపింది. "అమెరికా సుంకాలు, ప్రపంచ వాణిజ్య అంతరాయాలను ఎదుర్కోవడానికి ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే.. భారత్ మెరుగైన స్థానంలో ఉంది. దీనికి బలమైన అంతర్గత వృద్ధి, గణనీయమైన దేశీయ ఆర్థిక వ్యవస్థ, ఇతర దేశాలపై తక్కువ ఆధారపడటం వంటివి దోహదం చేస్తున్నాయి" అని మూడీస్ తన నివేదికలో పేర్కొంది. మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం చేసే వ్యయం జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని.. అదే సమయంలో వ్యక్తిగత ఆదాయ పన్ను కోతలు.. వినియోగాన్ని పెంచుతాయని మూడీస్ వెల్లడించింది. ఇక ఇటీవల సరిహద్దుల్లో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు భారత్ కంటే పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపైనే ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయని మూడీస్ వెల్లడించింది. "పాకిస్థాన్‌తో భారత్‌కు ఆర్థిక సంబంధాలు తక్కువ స్థాయిలో ఉన్నాయి. సరిహద్దుల్లో ఉద్రికత్తలు పెరిగినప్పటికీ.. భారత ఆర్థిక కార్యకలాపాలకు పెద్ద అంతరాయాలు ఉండవని మేం ఆశిస్తున్నాం. మరోవైపు భారత్‌లోని వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువ ఉత్పత్తి చేసే ప్రాంతాలు ఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉన్నాయి" అని మూడీస్ వివరించింది. అయితే అధిక రక్షణవ్యయం భారత ఆర్థికవ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది. వాణిజ్య చర్చలు ఫలవంతమైతే భారత ఉత్పత్తులు అమెరికాకు భారీగా ఎగుమతి అవుతాయని అంచనా వేసింది.

# విశాఖలో సెమీ రింగ్‌రోడ్డు

(మొదటి పేజీ తరువాయి)

అప్పులు చేసి వాటిని పక్కదారి పట్టించారు. 2014-2019 మధ్య 7లక్షల టిడ్కో ఇళ్లు ప్రతిపాదించాం. అవి వైసీపీ హయాంలో ఆగిపోయాయి. కేవలం 2లక్షల ఇళ్లు కూడా పూర్తిచేయలేక పోయారు. ఎంత ఖర్చయినా మహిళలకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఈ దసరాకి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తాం. ప్రతి ఇంటికి నీరిచ్చేలా 2021లో అమృత్ పథకం కోసం కేంద్రం నిధులిస్తే వైకాపా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదు. ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి మళ్లీ నిధులు వచ్చేలా చేశారు. రూ. 834 కోట్ల పనులు అమృత్ పథకం కోసం నిర్దేశించాం. కొద్ది నెలల్లో అమృత్ పథకం ద్వారా సర్ఫేస్ వాటర్ వస్తాయి. విశాఖ మెట్రోకి సంబంధించి అక్టోబర్ నెలలో పనులు మొదలుపెడతాం. డబుల్ డెక్కర్ మెట్రో కింద డీపీర్ ఇచ్చాం. కోటి మంది ప్రజలు ఉన్న హైదరాబాద్‌కు రింగురోడ్డు ఉంది. అదే తరహాలో విశాఖలో సెమీ రింగ్‌రోడ్డు నిర్మిస్తాం"అని మంత్రి నారాయణ తెలిపారు.

**మంత్రిని కలిసిన మేయర్**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పి.నారాయణను వీఎంఆర్‌డీ ఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీ ఏ కార్యాలయంలో విశాఖ నగర అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షకు విచ్చేసిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించామని, అలాగే విశాఖ నగర అభివృద్ధికి అధిక శాతం నిధులు కేటాయించి నగర అభివృద్ధికి సహకరించాలని, విజ్ఞప్తి చేసామని తెలిపారు. విశాఖ నగర అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని మేయర్‌కు మంత్రి హామీ ఇచ్చారు.

# నక్సలిజం నిర్మూలనలో ఇదో మైలురాయి : అమిత్ షా

(మొదటి పేజీ తరువాయి)

చెందడం ఇదే తొలిసారి. భద్రతా దళాలకు అభినందనలు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది" అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు.

# తిరువూరులో అనైతిక రాజకీయాలు

## జగన్‌కు గోడు వెల్లబోసుకున్న వైసీపీ కౌన్సిలర్లు



**తాడేపల్లి, విశాఖ సమాచారం:** తిరువూరు నగర పంచాయతీ ఎన్నికల్లో జరిగిన ఘటనపై పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు వైసీపీ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా తమపై టీడీపీ నాయకుల దాడి చేశారని, దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. పోలీసులు, కూటమి నేతలు, టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించారని చెప్పారు. కౌన్సిలర్లకు జగన్ ధైర్యం చెప్పారు. ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో మెజారిటీ లేకపోయినా బరితెగించి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను, దాష్టికాలను దీటుగా ఎదుర్కొందామని, చట్ట ప్రకారం న్యాయ పోరాటం చేద్దామని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా పోరాటం చేశారని ప్రశంసించారు. కాగా తిరువూరు నగర పంచాయతీ ఎన్నికల్లో ఉద్రికత్త చోటు చేసుకుంది. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో ఎన్నిక వాయిదా పడిరది. అయితే ఈ సందర్భంగా తలెత్తిన వివాదంపై వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై టీడీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారని మండిపడ్డారు.

# షర్మిల నిరాహార దీక్ష ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి విశాఖ చేరుకున్న షర్మిల.. స్టీల్ ప్లాంట్ వద్ద దీక్ష ప్రారంభించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న కార్మికులకు ఆమె మద్దతు తెలిపారు. 2021లో నాటి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయం తీసుకోగా.. అప్పట్లో కూడా ఆమె ఒక్కరోజు నిరాహార దీక్ష చేశారు. బీజేపీ హయాంలో స్టీల్ ప్లాంట్ కు కష్టాలు వచ్చాయని విమర్శించారు. అదానీకి మేలు చేయాలని స్టీల్ ప్లాంట్ ను చంపేస్తున్నారని ఆమె ఆరోపించారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ప్లాంట్లో 34 వేల మంది ఉద్యోగులు ఉంటే.. 11 సంవత్సరాల్లో కారణం లేకుండా అనేకమందిని తొలగించారని ఆరోపించారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్లో 20 వేల మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను తొలగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ అమ్మేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. కార్మికుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం' అని ప్రకటించారు. 'ఆంధ్రుల హక్కు- విశాఖ ఉక్కు నినాదంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో స్టీల్ ప్లాంట్ స్థాపించారు. కాంగ్రెస్ హయాంలో ప్లాంట్ లాభాల్లో ఉండేది. బీజేపీ ప్రభుత్వం రాగానే నష్టాలు అంటూ అందరినీ మోసం చేస్తున్నారు. ప్లాంట్ అభివృద్ధికి రూ. 11వేల కోట్లు ఇచ్చినట్లు కేంద్రం చేసిన ప్రకటనలు అన్నీ పచ్చి అబద్ధం. ఇచ్చినట్లే ఇచ్చి రూ. 8వేల కోట్లు బ్యాంక్ రుణాల కింద వెనక్కి తీసుకున్నారు. మరో రూ. 3వేల కోట్లు ఇవ్వాలంటే 5వేల మంది ఉద్యోగులను తొలగించాలని కండిషన్ పెట్టారు. స్టీల్ ప్లాంట్ నిర్వీర్యం చేసి అదానీకి అప్పగించాలని అనుకుంటున్నారు. అయినా కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఇది న్యాయమా? ప్రధాని మోదీకి మీరు ఊడిగం చేస్తున్నారా?' అని షర్మిల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కార్మికులను తొలగిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని షర్మిల హెచ్చరించారు.

# మావోయిస్టు అగ్రనేత కేశవరావు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల మృతుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు.

**గణపతి తర్వాత పార్టీ పగ్గాలు**

ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు మరో పేరు బసవరాజు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. కేశవరావుది శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామం. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్‌ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

**అలిపిరి దాడిలో ప్రధాన సూత్రధారి కేశవరావు**

మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు.

**పోలీసు సహాయకుడు మృతి**

ఈ ఎదురు కాల్పుల్లో పోలీసు సహాయకుడు ఒకరు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన జవానుకు ప్రాణాపాయం లేదని ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి వెల్లడిరచారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కరేగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో భద్రతా బలగాలు 31 మంది మావోయిస్టులను హతమార్చిన విషయం తెలిసిందే వీరిలో 16 మంది మహిళలు ఉన్నారు.

**ప్రధాని మోదీ అభినందనలు**

ఎన్‌కౌంటర్ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ.. మావోయిస్టులపై ఈ అద్భుత విజయాన్ని సాధించిన భద్రతా బలగాలను అభినందిస్తున్నాను అన్నారు. దేశంలో ప్రజలకు శాంతియుత జీవనాన్ని అందించడం కోసం మావోయిస్టులను, మావోయిజాన్ని తొలగిస్తామని ప్రకటించారు.

2nd pages111.qxd 5/21/2025 8:14 PM Page 3



# జి మాడుగులలో తిరంగ ర్యాలీ

## తిరంగా ర్యాలీలో పాల్గొన్నా టిడిపి బిజెపి, జనసేన కూటమి నాయకులు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):–** పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్ర మూకలు చేసిన దాడికి ప్రతిదాడిగా ఆపరేషన్ సింధూర్ పేరుతో జరిపిన దాడితో ఈ ప్రపంచానికి భారత్ సత్తా ఏంటో తెలిసిందని , ఎం పి పి లొంబోరి అప్పలరాజు అన్నారు.సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ (జాతీయ భద్రత కొరకు ప్రజల భాగస్వామ్యం) పేరుతో ప్రజలతో కలిసి తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు జి.మడుగులల ఎం పి డి ఓ కార్యాలయం నుంచి మూడురోడ్ల జంక్షన్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జి. మాడుగుల మండల ఎంపీపీ, లొంబోరీ. అప్పల రాజు , టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు, సోమ్మేలి.చిట్టిబాబు మండల పార్టీ అధ్యక్షులు వి. కొండలరావు , బిజేపి పార్టీ అల్లూరి జిల్లా ఇన్చార్జి, ట్రైకర్ డైరెక్టర్ , కూడ . కృష్ణారావు కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు, కురుసా ఉమా మహేశ్వరరావు.మండల అధ్యక్షులు రిమలి కళ్యాణం లిజనసేన మండల కార్యదర్శి, తెరవాడ.వెంకట్రావులి. ఎంపిటిసి జి.అప్పారావు. మాతె రామారావు. సర్పంచ్ లు కొండపల్లి సింహచలం. పలసి కృష్ణమూర్తి. పాటి బీంబాబు. కె నితిన్. బోయన కొండబాబు కూటమి నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మధ్య వైరుధ్యం తగదు

- ఉపాధ్యాయ మేధావులు ఉద్యమాలకు మార్గదర్శకంగా ఉండాలి!
- మాణిక్యం సమరెడ్డి డి.ఎల్.ఓ రాష్ట్ర సలహా దారులు

**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):–** అల్లూరి జిల్లాలో అమలు కానీ ఆదివాసీ భూ చట్టాలు, హక్కుల గురించి, పాడేరు ఐటీడీఏ లో జరుగుతున్న అవినీతి అధికారుల గురించి, సంవత్సరాలుగా ఒకే కార్యాలయం లో తిష్టవేసిన ఉద్యోగుల గురించి, ఆశ్రమ పాటశాలల్లో విద్యార్థుల మరణాలపై డి.ఎల్.ఓ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధా రాలతో ఇటీవల విడుదల చేసిన కరపత్రాన్ని తప్పు పడుతూ, ఐటీడీఏ రజనిని గిరిజన ఉపాధ్యాయ సంక్షేమ సంఘం వెనికేసుకు రావడం ఆదివాసి ఉద్యమాలకు గొడ్డలి పెట్టు అని డి.ఎల్.ఓ సలహాదారులు మాణిక్యం అన్నారు.ఆదివాసీ ప్రజా ఉద్యమ సంఘాలకు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మధ్య అంతరం ఉండటానికి వీల్లేదని అది ఆదివాసీ ఉద్యమాల ఉనికికే అత్యంత ప్రమాదకరమని ఉద్యమ సంఘాలకు మాణిక్యం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆదివాసీ హక్కులు, చట్టాల అమలుకై ఒక ఆశయంతో, సిద్ధాంతంతో సుదీర్ఘ పోరాటం చేస్తున్న డి.ఎల్.ఓ సంస్థపై మేధావుల సము దాయంతో నిండి ఉన్న ఉపాధ్యాయ సంక్షేమ సంఘం పత్రిక ముఖంగా సమాజానికి తప్పుడు సంకేతాలివ్వడం ఎంతవరకు సమంజసమని అన్నారు.గతంలో విద్యార్ధి, ప్రజా ఉద్యమాలను నడిపిన ఘనత, చరిత్ర ఉద్యోగ ఉపాధ్యాయా సంఘాలకు నాయకు లకు ఉన్నదని, కానీ నేడు ఉపాధ్యాయ సంఘాలు ప్రజా ఉద్యమాలపై భిన్నంగా వ్యవహరించడం సరికాదని, చాలా విచిత్రం గా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేసారు. డి.ఎల్.ఓ రిలీజ్ చేసిన కరపత్రంలో అంశాలపై విషయ సేకరణకు చాలా సమయం పట్టిందని, సమాచార హక్కు చట్టం ప్రకారం చాలా విషయాలు సేకరించి క్షేత్ర స్థాయిలో అవి నిజామా, కాదని పరిశీలించి నిర్ధారించుకోవడానికి సంవత్సర కాలం పట్టిందని అన్నారు.ఒక జిల్లా కలెక్టర్ గారిపై రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, డి. ఎల్. ఓ పిర్యాదు చేసిందంటే ఆషామాషి కాదు కదా, ఉపాధ్యాయ సంఘ మేధావులు అర్థం చేసుకోవల్సిందని, అనవసరంగా జిల్లా కలెక్టర్ పై కరపత్రం విడుదల చేయగలమా? చేస్తారా ఆలోచించాలని అన్నారు. ఇరవై ఐదు మంది సీనియర్ ఏ టి డబ్ల్యూ ఓ ఎస్ లిస్ట్ లో ఇరవై రెండవ స్థానంలో ఉన్న గిరిజనేతర రజని గారిని డిడి బాధ్యతలు అప్పగించడమంటేనే ఆదివాసీ ఏటి డబ్ల్యూ ఓ ఎస్ ను, సీనియర్ ఏ టి డబ్ల్యూ ఓ ఎస్ ను కించపరచడమని అన్నారు.అంతే కాకుండా సమీక్ష సమావేశల్లో సీనియర్ మోస్ట్ హెడ్మాస్టర్లను సహితం కామన్ సెన్స్ లేకుండా కించపరిస్తూ అవమానకరంగా మాట్లాడ్డం, అనేక మంది హెచ్ ఎమ్ లను, వార్డెన్ లను వేదించడం ఇవన్నీ అక్షరాలా నిజమేనని అలాంటి అధికారిని గొప్పవ్యక్తని మేధావులతో కూడిన ఉపాధ్యాయ సంఘం, చరిత్ర కలిగిన ఉపాధ్యాయ సంఘం వంతపాడటం సరికాదు, శోషనీయమని మాణిక్యం అన్నారు.5వ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాలు మాకే దక్కాలని దేశ ఆదివాసులు, నిరుద్యోగ యువత పోరాటాలు చేస్తున్న క్రమములో యువతకు ఉద్యోగ మేధావులు సరైన దిశా నిర్దేశం చేయాల్సిన అవసరమున్నది. ఆదివాసు లెదుర్కొంటున్న తాత్కాలిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తూనే, దీర్ఘకాలిక సమస్యల పరిష్కార దిశగా అన్ని వర్గాలను కలుపుకొని స్వయంపాలన రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తున్న డి.ఎల్.ఓ సామాజిక దృక్పధన్ని అర్థం చరసుకోవాలని ఉపాధ్యాయ సంఘ మిత్రులకు డి.ఎల్.ఓ రాష్ట్ర సలహా దారులు సూచించారు. ఉద్యమాల్లో తొందర పాటు విమర్శలకు వీల్లేదని అన్నారు. కనుక ఆదివాసీ ప్రజా సంఘాలు, ఉద్యోగ విద్యార్ధి సంఘాలు, అవసరం మేరకు పార్టీలకతీతంగా వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న ఆదివాసీ ప్రతినిధులు ఏకమై ఐక్య ఉద్యమాలు చేయుటకు మేధావులు కృషి చేయాలనీ డి. ఎల్. ఓ రాష్ట్ర సలహా దారులు సమరెడ్డి మాణిక్యం కోరారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ప్రకటన నెం. WDS/29/Repair and Rehabilitation of Transformer (WAG9)/2025-26

పని పేరు: డీజిల్ లోకో మోటివ్ షెడ్/విశాఖపట్నం వద్ద 02 నెంబర్లు WAG9 త్రీ ఫేజ్ లోకోలు కొరకు 6531 KVA ట్రాన్స్ ఫార్మర్ యొక్క రిపేరు మరియు రిహాబిలిటేషన్ చేయుట.

సుమారు పని విలువ: ₹ 1,05,53,653.39, బయానా: ₹ 2,02,800/-, పని పూర్తి చేయు కాలం: 12 నెలలు (01 సంవత్సరం).

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 18.06.2025న 1500 గంటలకు.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు www.ireps.gov.in వెబ్సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 10 (పది) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (D)

PR-151/Q/25-26 విశాఖపట్నం


# రాజాం వై జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు పునఃసంస్థాపన కోసం మనవి



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని రాజాం వై జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు పునః సంస్థాపన కోసం ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల నాగేశ్వరావు పోలీస్ అధికారులకు మనవి చేశారు. ఈ మధ్య కాలంలో ఈ ప్రాంతంలో అనేక దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, బైక్ చోరీలు చోటుచేసుకుంటున్నాయని కొంతమంది దొంగలు మహిళల మేడలపై బంగారు ఆభరణాలు దొంగలిస్తున్న సంఘటనలూ నమోదయ్యాయని, పోలీసుల పటిష్టమైన నిఘా ఉన్నప్పటికీ, సీసీ కెమెరాలు లేని ప్రదేశాల్లో దొంగలు సులభంగా తమ పనిని నిర్వహిస్తున్నారన్నారు. రాజాం వై జంక్షన్ ప్రధాన కూడలి ద్వారా ఏజెన్సీ, చోడవరం, మాడుగుల, అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి ప్రాంతాలవైపు తరచూ రాకపోకలు జరుగుతుంటాయని గతంలో ఈ జంక్షన్ వద్ద పోలీస్ చెక్‌పోస్ట్, సిసి కెమెరాల ద్వారా నిఘా ఉండేది. కానీ గత సంవత్సరం నుంచి కెమెరాలు పని చేయకపోవడం వల్ల, దొంగలు మరింత చురుగ్గా వ్యవహరిస్తున్నారన్నారు.

కాబట్టి, రాజాం ప్రాంత ప్రజల రక్షణ, భవిష్యత్ ప్రమాదాలను నివారించడానికీ, ఈ జంక్షన్ వద్ద మళ్లీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందని వేసవి కాలంలో దొంగలు ఎక్కువగా సంచరిస్తారని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అందుకే ముందస్తుగా దాతలు సహకారం తో సీసి కెమెరాలు ఏర్పాటు కు కృషి ఎస్సై ఏ. శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు.

# అన్న కాంటీన్ కు మంజూరైన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**చోడవరం, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని చోడవరం మేజర్ పంచాయతీ లో ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గెట్ ఎదురుగా అన్నా క్యాంటీన్ కు స్థలం మంజూరు అయింది. స్థలాన్ని ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గూనూరు. మల్లు నాయుడు, పంచాయతీ ఈవో నారాయణరావు, వార్డు మెంబర్ టి.శ్రీను, మండల సర్వేయర్ దినేష్, ఎంపీటీసీ నాయుడు, సకురు. కోటేశ్వరరావు, గర్ల్స్ హై స్కూల్ చైర్మన్ జి. సత్తిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎలక. మల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ.. నన్నయకు మకిలీ..



**రాజానగరం :** సాధారణ సమయాల్లో అదో ఖాళీ భవనం. అక్కడ ఎలాంటి సందడి ఉండదు. అదే అధికారులు తనిఖీలకు వస్తున్నారంటే మాత్రం ఆగమేఘాలపై ఓ కళాశాల పేరున బోర్డు, విద్యార్థులు కూర్చునే బల్లలు, కుర్చీలు, బ్లాక్ బోర్డులు, అధ్యాపకులు, విద్యార్థులు.. ఇలా అందరూ సిద్ధమైపోతారు.. సినిమా సెట్టింగ్ తలపించే రీతిలో ఏర్పాట్లు పూర్తి చేస్తారు. అధికారులు రావడం, అక్కడ నిర్వహణ, సదుపాయాలు పరిశీలించడం.. అంతా బాగుందని అటు వెళ్లిపోగానే తిరిగి ఆ సెట్టింగ్ తొలగించడం షరామామూలే. ఉభయ గోదావరి జిల్లాల విద్యాప్రదాయిని నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కొన్ని నకిలీ కళాశాలల్లో దుస్థితి ఇది.

**బోగస్ సృష్టించి.. నిధులు మళ్లించి..**

కొన్ని నకిలీ కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు, ఆధార్‌కార్డులు, ఇతర గుర్తింపు పత్రాలన్నీ నకిలీవి సృష్టించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటుండటం గమనార్హం. అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నపుడు నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పడం, అనుమతి ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచితే అధికారులపై రాజకీయంగా ఒత్తిడి తీసుకురావడం పరిపాటిగా మార్చారని వర్సిటీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. విద్యా సంవత్సరం ఆఖరులో పరీక్షల వేళ విద్యార్థుల భవిష్యత్తును ప్రస్తావిస్తూ అఫిలియేషన్‌కు ఒత్తిడి చేయడం మరో రకం మార్గంగా మార్చుకున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

**21 కళాశాలలు ఆ జాబితాలో..**

నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇప్పటి వరకు 21 బోగస్ కళాశాలలను అధికారులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. మరిన్ని నకిలీలు ఉండొచ్చనే అనుమానంతో సమగ్ర విచారణ జరుగుతోంది. విద్యాలయం ఏర్పడినప్పటి నుంచీ ఈ బాగోతం సాగుతుండగా.. ఇప్పటివరకు సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం కావడం అనుమానాలకు తావిస్తోంది. వర్సిటీకి వీసీగా వచ్చిన ఎస్.ప్రసన్నశ్రీ కఠినంగా వ్యవహరిస్తుండటంతో వాస్తవాలు బహిర్గతమవుతున్నాయి. ఇప్పటివరకు 21 కళాశాలలు నకిలీల జాబితాలో తేలగా.. వాటి అనుమతిని రద్దు చేసినట్టు స్పష్టమవుతోంది.

**కఠిన చర్యలు తీసుకుంటాం..**

తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి కళాశాలలకు అనుమతులు తీసుకుంటే వాటిపై కఠినచర్యలు తీసుకుంటాం. ఇదే విషయాన్ని వీసీల సమావేశంలోనూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. విద్యార్థులు కళాశాలలో చేరే ముందు విశ్వవిద్యాలయ అనుమతి పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయో? లేదో? పరిశీలించుకోవాలి. తనిఖీలకు వెళ్లే బృందాలు అక్కడి పరిస్థితిని జియోట్యాగింగ్ చేయాలని ఆదేశించాం. వర్సిటీ పరిధిలో 398 కళాశాలలు ఉండగా 21 నకిలీవిగా గుర్తించి చర్యలు చేపట్టాం.

# ప్రారంభమైన గోవా డాబా రెస్టారెంట్



**రావికమతం, (విశాఖ సమాచారమ్):–** మండలంలో కొత్తకోట శివారు కంచుగుమ్మల జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన గోవా దాబా అండ్ రెస్టారెంట్ ను కొత్తకోట గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ మేనేజింగ్ పార్ట్నర్ శ్రీ బలరాం దాబా ప్రారంభోత్సవ కార్యక్రమానికి తమను ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆహ్వానితుల పలువురు మాట్లాడుతూ నాణ్యమైన ఆహార పదార్థాలు సరసమైన ధరలకు వినియోగదారులకు అందించాలని, అలాగే ఈ ప్రాంత ప్రజలు తాలూకా అభిమానాన్ని చూరగోణాలని, వ్యాపార అభివృద్ధిలో మరింతగా రాణించాలని వారు కోరారు. పెరుగుతున్న జనాభా ప్రాతిపదిక ప్రకారం అనేకమంది ప్రజలు ఇదే రహదారి గుండా పలు రకాల పనుల నిమిత్త ప్రయాణం చేస్తున్నవారికి ఈ దాబా భోజనం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దాబాను నిర్వహించి అందరి యొక్క మన్ననలను పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ సిఎం జగన్‌ను కలిసిన హేమంత్



**పరవాడ (విశాఖ సమాచారమ్):–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ని బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం లో అనకాపల్లి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు బొడ్డపల్లి హేమంత్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమించిన తర్వాత మొదటిసారి వైఎస్ జగన్ ని కలిసి నాపై నమ్మకంతో కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో విద్యా సంస్థల చర్చించినట్లు ఆయన తెలిపారు. వైసిపి అధికారంలోకి రాగానే విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, విద్యార్థి విభాగం తరఫున పోరాటాలు చేస్తూ సామాజిక కార్యక్రమాలలో చురుకగా పాల్గొంటూ సమాజ సేవలో భాగస్వాములు అయి ప్రజలకు మేలు జరిగేలా పనులు చేస్తూ ప్రజల మన్నన్నలు పొందాలని హేమంత్ కుమార్ కి జగన్ సూచించారు.

# అరకులోయలో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక





**అరకులోయ, (విశాఖ సమాచారమ్):–** అరకులోయ, అంధ్ర ఊటీగా పేరుగాంచిన అరకులోయలో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీ యు డబ్ల్యు జె) విశాఖ ఉమ్మడి జిల్లా రూరల్ అధ్యక్షులు స్వామి సమక్షంలో అరకులోయ లో స్థానిక అక్షయ ఇన్ హెూటల్లో నిర్వహించారు ఈ సమావేశానికి డుంబ్రిగూడ, అనంతగిరి, అరకులోయ మండలాలు కు చెందిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సుమారు 60 మంది హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు స్వామి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మూడు మండలాలకు చెందిన ప్రెస్ క్లబ్ కార్యవర్గాల ఎన్నికలు చేపట్టారు.

అరకు వ్యాలీ మండల అధ్యక్షుడిగా ఎల్బీ వెంకటేశ్వరరావు, ప్రధాన అధ్యక్షులుగా ఆర్. రవి, ఉపాధ్యక్షులుగా డి. గోవర్ధన్, ఇతర సభ్యుల ఎంపిక కూడా జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అరకు వ్యాలీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్బి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, “మీడియా మిత్రులు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు. కొన్ని అపోహల వల్ల వేరే వేరుగా కార్యవర్గాలు ఏర్పడటం బాధాకరం. అందరం ఐక్యంగా ఉంటే మీడియా వర్గానికి ఎంతో మేలు జరుగుతుంది” అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అనంతగిరి, డుంబ్రిగూడ మండలాల మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మూడు మండలాల పత్రికా ప్రతినిధుల ఐక్యతను ప్రతిబింబించే ఈ సమావేశం, స్థానిక మీడియా రంగంలో కొత్త మార్గదర్శకంగా నిలవనుంది.

# నా బిడ్డల్ని రక్షించండి



**కాకినాడ క్రైం:** ఏ దిక్కూ లేక.. కాకినాడ బస్టాండ్ సమీపాన తన ముగ్గురు పిల్లలతో కలిసి హెూరు వానలో ఆకలి, బిడ్డల అనారోగ్యంతో రోదిస్తున్న ఓ తల్లిని, ఆమె పిల్లల్ని జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) అధికారులు రక్షించారు. చుట్టుపక్కల వారు స్పందించకపోయినా కాకినాడ ప్రభుత్వ ఐటీఐ విద్యార్థి వనుము పరమేశ్వర్, మత్స్యకారుడు రాజు మానవత్వాన్ని చాటుకోవడంతో ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.విజయ తన బృందంతో అక్కడకు చేరుకున్నారు. రోదిస్తున్న తల్లికి ధైర్యం చెప్పి, ఆహారం అందించే ఏర్పాట్లు చేశారు. వాన నీటిలో తడిసి, నానిపోయి చిగురుటాకుల్లా వణికిపోతున్న పిల్లల్ని కాపాడి, సపర్యలు చేశారు. తల్లి నుంచి వివరాలు సేకరించారు. భర్త వదిలేయడంతో తాను ముగ్గురు పిల్లలతో రోడ్డున పడ్డానని ఆ మహిళ తన కష్టాన్ని విజయ బృందం వద్ద చెప్పుకొని కన్నీటి పర్యంతమైంది. తనకు ఇద్దరు నాలుగు, రెండేళ్ల మగపిల్లలతో పాటు నాలుగు నెలల వయసు బిడ్డ కూడా ఉందని చెబుతూ గుండెలకు హత్తుకున్న శిశువును చూపింది. ఎందుకు ఇంతలా ఏడుస్తున్నావని వారు ప్రశ్నించగా.. తన నాలుగేళ్ల కుమారుడికి పోలియో వల్ల కాళ్లు చచ్చుబడి నడవలేకపోతున్నాడని, పాకడం వల్ల రెండు కాళ్లు పుండ్లు పడ్డాయని, చూసి తట్టుకోలేక ఏడ్చానని విలపించింది. తన బిడ్డల్ని కాపాడాలని వేడుకుంది. కన్నబిడ్డల దుస్థితి చూసి తాళలేక ఆ తల్లి మానసిక వేదనకు గురైందని గుర్తించిన విజయ, ఆమె బృందం వారిని కాకినాడ జీజీహెచ్‌లోని దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు పరమేశ్వర్, రాజుల సాయంతో తరలించింది. కాళ్లు చచ్చుబడిన నాలుగేళ్ల బాలుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అంతకు ముందు పిల్లల్ని రాజమహేంద్రవరంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు వర్చువల్‌గా హాజరుపరిచారు. కమిటీ ఆదేశాల మేరకు ముగ్గురు పిల్లలతో పాటు తల్లిని వన్‌స్టాప్ సెంటర్ పర్యవేక్షణలో ఉంచి సంరక్షిస్తున్నారు. తల్లీబిడ్డలను రక్షించిన వారిలో విజయతో పాటు కౌన్సిలర్ దుర్గారాణి, సోషల్ వర్కర్ ఎస్.చినబాబు కూడా ఉన్నారు.

# మీ పాలనలో రైతులకు మేలు జరిగిందయ్యా!



**అమరావతి, (విశాఖ సమాచారమ్):–** ‘మీ పాలనలో రైతులందరికీ మేలు జరిగిందయ్యా. మీ హయాంలో రైతుల కష్టాలు తెలుసుకుని అన్నదాతకు అండగా నిలిచి.. మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు ఎలాంటి సాయం అందకపోగా ఆరుగాలం కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయడం లేదు. రైతులు రోడ్డెక్కి నిరసనలు, ఆందోళనలు చేయాల్సి వస్తోంది. అయినా పట్టించుకోవడం లేదయ్యా’ అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పొడగట్లపల్లికి చెందిన రైతు మెర్ల సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఎదుట వాపోయారు.

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో రైతు మెర్ల సత్యనారాయణ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి చేయూత లేకపోయినా తమ ప్రాంత రైతులు ఎకరాకు 55%–%60 బస్తాల ధాన్యం పండించారని ఆ రైతు వివరించారు. ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులంతా నిరసనలు, ఆందోళనలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదని వాపోయారు.

ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కళ్లాల్లోనే ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి వైఎస్ జగన్ బదులిస్తూ.. అన్నదాతకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతుల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వైఎస్ జగన్ హామీతో రైతు సత్యనారాయణ సంతోషంతో తాను పండించిన వరి కంకులను ఆయనకు బహూకరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌ను మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రామచంద్రాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ కలిశారు.

# వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పోలీస్ సేవలు ఇక మీ చేతిలోనే

## వాట్సాప్ నంబర్ 95523 00009



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):–** మీరు ఇకపై మీ ఎఫ్ఐఆర్ (ఎఫ్ ఐ ఆర్) ను వేగంగా, సులభంగా డిజిటల్ రూపంలో పొందవచ్చు. ఇక పోలీస్ స్టేషన్‌కు వెళ్లే అవసరం లేదు. మీ మొబైల్ నుండే పోలీస్ సేవలను పొందండి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా “ప్రజల సేవలో స్మార్ట్ పోలీసింగ్ ఇప్పుడు వాట్సాప్‌లోనే” కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కొత్త డిజిటల్ సేవల ద్వారా ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడం లక్ష్యం అని జిల్లా ఎస్పీ తెలిపారు.

పోలీస్ సేవలు పొందడం ఎలా ?

మొదటి విధానం :– మీ మొబైల్ నుంచి 95523 00009 నెంబర్‌కు హాయ్ అని వాట్సాప్‌లో మెసేజ్ చేయండి. ద్వితీయ విధానం: వచ్చిన మెనూ నుంచి “సిటిజన్ సర్వీసెస్” లేదా పౌర సేవలు ఎంపిక చేయండి. తృతీయ విభాగం: అందుబాటులో ఉన్న సేవల నుంచి మీరు అవసరమైన సేవను ఎంచుకోండి. ఉదాహరణకు:

ఎఫ్ఐఆర్ డౌన్లోడ్,ఎఫ్ఐఆర్ స్థితి తెలుసుకోవడం.

నాలుగవ విధానం:– అవసరమైన వివరాలు నమోదు చేసి సమర్పించండి. వెంటనే మీ మొబైల్‌ఫోన్‌లో ఎఫ్ఐఆర్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు లేదా దాని స్థితి తెలుసుకోవచ్చు అని,ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీస్ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ఈ డిజిటల్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని లబ్ధి పొందాలని కోరుతున్నాం. అన్ని పోలీస్ స్టేషన్లలో సంబంధిత సమాచారం, పాంప్లెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.”

మీరు కూడా ప్రయోగించండి %–% పోలీస్ సేవలు ఇప్పుడు కేవలం ఒక మెసేజ్ దూరంలో అని ఆయన తెలిపారు.

2nd pages111.qxd 5/21/2025 8:15 PM Page 4



# విశాఖ సమాచారమ్

గురువారం 22-5-2025

## ఆడపిల్లలపై వివక్ష వద్దు

దేశంలో, రాష్ట్రంలో బాలల లింగ నిష్పత్తిలో పెరుగుతున్న వ్యత్యాసం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో 2021లో జననాల సంఖ్య 2.42 కోట్లుగా ఉంది. జననాల్లో బాలురు 52.2%, బాలికలు 47.8 శాతంగా నమోద్కెంది. దీని ప్రకారం ప్రతి 1000 మంది బాలురకు 916 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. ఎస్ఆర్ఎస్ నివేదిక ప్రకారం తెలంగాణలో 2021లో 3,18,300 మంది మగ పిల్లలు, 2,93,400 మంది ఆడపిల్లలు పుట్టారు. ప్రతి 1000 మంది మగ పిల్లలకు 922 మంది ఆడపిల్లలు మాత్రమే పుట్టినట్లు లెక్కలు చెబుతున్నాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో బాలల లింగ నిష్పత్తి (0 -6 సంవత్సరాలు) 927 ఉండగా, 2011 జనాభా లెక్కల నాటికి 919కి తగ్గింది. 2001 జనాభా లెక్కలలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాలల లింగ నిష్పత్తి 961 ఉండగా, 2011 నాటికి 939కి తగ్గింది. గడిచిన రెండున్నర దశాబ్దాలుగా నాటి 2001 జనాభా లెక్కల నుంచి నేటి ఎస్ఆర్ఎస్ లెక్కలు తేల్చిన వివరాల ప్రకారం దేశంలో, రాష్ట్రంలో బాలల లింగ నిష్పత్తి క్రమేణా క్షీణించటం ఆందోళన కలిగిస్తోంది.

పితృస్వామ్య భావజాలం సమాజంలో ఆవరించడంతో బాలికలు అంటే చిన్నచూపు వారి పుట్టుకకు, ఎదుగుదలకు, అభివృద్ధికి ఆటంకంగా తయారవుతున్నది. ఇంటిలో, సమాజంలో ఆడపిల్లలు ఆహారం, విద్య, వైద్యం, పని విభజన, స్వేచ్ఛ మొదలగు అన్ని విషయాల్లోనూ తీవ్ర వివక్షకు గురవుతున్నారు. ఏనాటికైనా కట్న కానుకలు సమర్పించి ఆడపిల్లను పరాయి ఇంటికి పంపించి వేయాల్సిందేనన్న భావన సమాజంలో పాతుకునిపోవడంతో వారు తీవ్ర అసమానతలకు, అవమానాలకు గురవుతున్నారు. సంతానంలో ఒకరు లేదా ఇద్దరు చాలు అనే భావన సమాజంలో నెలకొనడంతో పుత్ర సంతానంపై కోరిక పెరగడమే కాక కూతురు వద్దనే భావన బలపడుతోంది. దీనివల్ల భవిష్యత్తు కాలంలో అమ్మాయిల సంఖ్య ఇంకా తగ్గిపోయి కుటుంబ వ్యవస్థకు విఘాతం కలిగి సమాజంలో అసాంఘిక కార్యకలాపాలు చెలరేగటానికి ఆస్కారం ఉంది. తగ్గిపోతున్న ఆడపిల్లల సంఖ్య సామాజిక, ఆర్థిక, ఆరోగ్య అంశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. అత్యాచారాలు, లైంగిక నేరాలు, అమ్మాయిల అమ్మకం, కిడ్నాపుల వంటి సమస్యలు పెరిగిపోతాయి. బాల్య వివాహాలు ఎక్కువై ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అమ్మాయిలు దొరకక పురుషుల వివాహాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక సామాజిక వర్గాలలో బాలికల సంఖ్య తగ్గిపోయి ఆ వర్గాల్లోని యువకుల వయసు 35, 40 సంవత్సరాలు చేరుకున్నప్పటికీ పెళ్లిళ్లు గాక వారి తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

తల్లి కడుపులో ఉండగానే ఆడ శిశువులు పుట్టే హక్కును, జీవించే హక్కును కోల్పోతున్నారు. గర్భాశయంలో ఆడపిల్లలను కడతేరుస్తున్న సంఘటనలు దేశంలో నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కొందరు వైద్యులు కాసులకు కక్కుర్తిపడి స్కానింగ్ ప్రక్రియ ద్వారా తల్లి కడుపులోని బిడ్డ లింగాన్ని నిర్ధారిస్తూ గర్భాశయంలోనే ప్రాణాన్ని చిదిమేస్తూ అబార్షన్లకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇబ్బడిముబ్బడిగా ఉన్న స్కానింగ్ సెంటర్లు గ్రామీణ ప్రాంతాల వరకు తమ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని లింగ నిర్ధారణ పరీక్షలతో కోట్ల రూపాయలు దండుకుంటూ మాతా, శిశు ప్రాణాలతో చెలగాటాలాడుతున్నారు. భ్రూణ హత్యలు నివారించడానికి పీసీపీఎన్ డీటీ- 1994 చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చినప్పటికీ ఫలితం లేకుండాపోతోంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల అలసత్వంతో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు యథేచ్ఛగా గర్భంలో ఉన్న శిశువు లింగాన్ని నిర్ధారిస్తూ అబార్షన్లకు పాల్పడుతూ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్టు కూడా దేశంలో ఉన్న లింగ వివక్షను అసమానతలను వేలెత్తి చూపింది. 2023లో 146 దేశాలలో 127వ స్థానంలో ఉన్న భారతదేశం, 2024లో మరింత దిగజారి 129వ స్థానానికి పడిపోయింది. బాలబాలికల సంఖ్య సమతుల్యంగా ఉన్నప్పుడే వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండి సమాజంలో అనేక సమస్యలు నివారించబడతాయి. దేశవ్యాప్తంగా లింగ వివక్షను రూపుమాపేందుకు కృషి చేస్తున్నట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రచార ఆర్భాటాలకే ప్రభుత్వ కార్యక్రమాలు పరిమితం అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన బేటీ బచావో -బేటీ పడావో పథకం ప్రారంభమై దశాబ్దకాలం గడుస్తున్నా అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంఖ్యను పెంచేందుకు గల అవకాశాలపై దృష్టి పెట్టి బాలికల పుట్టుకకు, ఎదుగుదలకు, అభివృద్ధికి, రక్షణకు ఆటంకంగా ఉన్న అవరోధాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. భ్రూణ హత్యల నిరోధక చట్టాన్ని అతిక్రమించిన వైద్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిర్భయ, పోక్సో చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.

## పంచాంగం

గురువారం 22-5-2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరము

ఉత్తరాయణం, వసంత రుతువు

వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. దశమి రా. 1.13 |
| నక్షత్రం | : పూర్వాభాద్ర సా. 5.47 |
| వర్జ్యం | : రా. 2.41 ల 4.10 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**

**vspnews4@gmail.com**

**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# హనుమద్వైభవం

## (నేడు హనుమజ్జయంతి సందర్భంగా)



ఆంజనేయుడి గూర్చి రామాయణంలో వాల్మీకి మహర్షి ప్రత్యేక వ్యక్తిగా కీర్తించారు. హనుమ వైభవం,ఆయన దర్శనం ఇతర వివరాలు పరాశర సంహితలో శోదాహరణంగా వివరణ ఉంది. "యత్రయత్ర రఘునాథ కీర్తనం,"తత్రతత్ర కృతమస్త కాంజలిం" రామనామం జపించిన చోటు హనుమ ఉంటారు. తులసీదాస్ హనుమను దగ్గరగా దర్శించిన వారిలో అగ్రగణ్యుడు. ఆయన రచించిన హనుమాన్ చాలీసా హనుమ భక్తులకు తారకమంత్రమే."మనోజవం మారుతతుల్యవేగం" అంటూ ఆయన రూపాన్ని లక్షణాలను చక్కగా వర్ణించారు. మనోజవం అంటే మనస్సుకంటేవేగం కలవాడు, మారుతతుల్య వేగం అర్థం వాయువుకంటే వేగమైన వాడు,ఆయన వేగానికి తార్కాణాలు గా దక్షిణ సముద్రాన్ని లంఘించాడు, లక్ష్మణుడు గాయపడినప్పుడు సంజీవిని పర్వతాన్ని కైలాస పర్వత ప్రాంతం నుంచి పెళ్లగించుకు రావడం వేగంతో నే సాధ్యమయ్యాయి. ఆయనకు "అసాధ్యసాధక" అనే పేరు ఈ సందర్భంలో సరిపోతుంది. అలాగే సీతమ్మ జాడ కనుగొనడం ఆయనకే సాధ్యమైంది. పుష్పకవిమానంలో రావణుని సతుల అంగాంగాలను చూసినా చలించని జితేంద్రియుడు. బుద్ధి మతాం వరిష్ఠం అంటే బుద్ధిమత్వంలో ఆయనను మించిన వారు లేరని అర్థం. ఆపద సమయంలో,యుద్ధం సమయంలో ఆయన మనస్సు చురుకుగా పని చేస్తుంది. ఇంద్రజిత్ వధ సమయంలో అతని యాగం భగ్నం చేయడానికి రాక్షసులను మర్దించడం ద్వారా అతని బుద్ధిమరలేలా చేసాడు. దాంతో లక్ష్మణుడు ఇంద్రజిత్ ను అయిందాస్త్రంతో వధించాడు. లంకా ప్రవేశంలో సింహిక అనే భూతాన్ని తెలివిగా మట్టు పెట్టడం ఆయన బుద్ధిమతానికి నిదర్శనం. 100 యోజనాల దక్షిణ సముద్రం దాటలేమని వానరులు చింతిస్తుంటే జాంబవంతుడు హనుమ బల రహస్యాన్ని వివరించాడు. హనుమను కీర్తిస్తే మహాకాయుడిగా మారతాడని దేవతల వరమని జాంబవంతుడు తెలిపాడు. అంత వానరులు జై హనుమ,రామభక్తా అంటూ కీర్తిస్తుంటే ఊహించని విధంగా శరీరం పెరిగి దక్షిణ సముద్రాన్ని అలవోకగా లంఘించాడు. హనుమ అనే కంటే "శ్రీరామ దూతం శిరసా నమామి" అనడమే ఆయనకు ఇష్టం. లంక నుంచి వస్తూ " సీత జాడ తెలిసింది" అని సముద్రం ఒడ్డుకు చేరకముందే అరచి వానరులకు సంతోషంతో తెలిపిన హనుమ. సీత జాడ కనుగొన పోవడంతో సుగ్రీవుడు చంపుతాడని భయపడిన అంగదుని ప్రాయోపవేశం నుంచి రక్షించాడు. నాలుగురోజులలో వారధి నిర్మించి రామసైన్యానికి తిరుగులేదనిపించాడు. సీత జాడ కోసం లంక వెళ్లినప్పుడు రావణ సైన్యంలో నాలుగోవంతు వీరులను దునుమాడాడు. ఆయన సంకల్పమే బలంగా మారి రాక్షసులను వధించింది. వాల్మీకి రామాయణంలో సుందరాకాండ లో హనుమ కేవలం తన శరీరంతో, చేతులతో, కాళ్లతో, భుజాలతో రాక్షసులను మాంస ముద్దలుగా మార్చాడని తెలిపారు. హతులలోరావణుని ముద్దుల కుమారుడు అక్ష కుమారుడు. మంత్రి కుమారుడు జంబు మాలి ఉన్నారు. ఇంద్రజిత్ వేసిన బ్రహ్మాస్త్రానికి లొంగినట్లు నటించి రావణుని వద్దకు వెళ్లాడు. రాముని శౌర్యం చెప్పి , క్షమాపణ తో సీతను అప్పగించాల్సింది గా హితవాక్యాలు చెప్పాడు. రావణ సభలో విభీషణుడి ధర్మాచరణ గుర్తించాడు. లంకలో రాక్షసులను దునుమాడడం ద్వారా వారి బలాబలాలు తెలుసుకుని రామునికి వివరించాడు. యుద్ధంలో అరివీర భయంకరంగా రాక్షసులను హతమార్చాడు. రావణ వధ అనంతరం రాముని ఆదేశంతో నందిగ్రామం వచ్చి భరతుని ప్రాయోపాశం నుంచి రక్షించాడు. శ్రీరామ పట్టాభిషేక సమయంలో రాముడు ఇచ్చిన పచ్చల పతకం పదిలంగా ఉంచుకున్నాడు. చిరంజీవిగా చిరకాలం రామభక్తుల హృదయాల్లో నిలిచాడు. ఎంతటి జ్ఞానవంతుడైనా పెద్దల ఎడల వినయం కలిగిన భజరంగభళి. ఆయనపేరు తలచి రామ గానం చేస్తే భక్తులకు సదావెంట ఉండి రక్షించే హితకారి హనుమ. ఆయన మించిన రక్షకుడు,రామబంటు ముల్లోకాలలో లేడు.

**యం.వి.రామారావు, 8074129668**

# పిబిఎస్, ఓ జ్ఞాపకం!!

ఓ పుస్తకం కోసం వెతుకుతుంటే ఓ పుస్తకం మధ్యలో ఓ కాగితం దొరికింది. అది తీసి చూద్దునూ....ఇవ్వాల్టికి సరిగ్గా ముప్పై నాలుగేళ్ళ క్రితం మా నాన్నగారైన యామిజాల పద్మనాభ స్వామిగారిని ప్రశంసిస్తూ పి.బి. శ్రీనివాస్ గారు రాసిన పద్యాలవి. వాటిని చదువుతుంటే వైపీఎస్ – పిబిఎస్ లు కళ్ళముందు కనిపించారు.

మేము మద్రాసులోని వివేకానంద స్ట్రీట్ (టీ. నగర్) లో ఉన్న ఇంటికి పిబిఎస్ గారు వచ్చి తాను రాసిన పద్యాలు చదివి వినిపించడం ప్రత్యక్షంగా చూసే భాగ్యం కలిగింది. ఒక్కొక్కప్పుడు ఓ పాటకూడా పాడి విన్పించేవారు.

పిబిఎస్ అంటే ప్రతివాదిభయంకర శ్రీనివాస్. అయితే ఆయన ఇంగ్లీషులో పిబిఎస్ అని కుదించి చెప్పన్న మూడక్షరాలను ప్లే బ్యాక్ సింగర్ అని అని విడమరిచి చెప్పుకున్నారు సరదాగా. తాను సినీ నేపథ్య గాయకుడిగా ఉఃడటంలో పరిపూర్ణ తృప్తిని పొందానన్నారు. తెలుగులో కంటే కన్నడం, తమిళంలో ఆయన ఎక్కువ సినిమా పాటలు పాడారు.

ఆయనకు బహుభాషావేత్త. తెలుగు , కన్నడం, తమిళం, మళయాలం, హిందీ, ఉర్దు, ఇంగ్లీషు, సంస్కృతం భాషలలో అనేక గజళ్ళు రాసారు.

ఆయన తల్లికి సంగీతమంటే చాలా ఇష్టం. అది ఆయనకు వరమైంది. నిజానికి ఆయన తండ్రిగారు కొడుకుని ఓ ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకున్నారు. కొడుకుని సంగీతంపట్ల వెళ్ళనివ్వకుండా చూడాలనుకున్నారు. అందుకు ఓ కారణముంది.

పిబిఎస్ జాతకం చూసిన జ్యోతిష్కుడు "ఈయన సంగీతాన్ని ఎన్నుకుంటే జీవితంలో అనేక ఆటంకాలు ఎదురవుతాయి" అని చెప్పారట. దాంతో తండ్రి ఆయనతో బి.కాం. చదివించారు. అనంతరం కొడుకుని ఓ లాయరుగా చూడాలనుకుని చెన్నై లా కాలేజీలో చేర్పించారు. అయితే సంగీతం పట్ల ఉన్న ఆశతో పిబిఎస్ చదువుపట్ల ఆసక్తి చూపలేదు. సంగీతంపట్ల మొగ్గు చూపారు.

తమిళంలో గాయకుడు ఎ.ఎం. రాజాను వెండితెరకు పరిచయం చేసిన ఎస్. ఎస్. వాసన్



పి.బి.ఎస్. ని తమిళంలో ఓ గాయకుడిగా పరిచయం చేశారు.

జెమినీ సంస్థ వారి మిస్టర్ సంపత్ సినిమాతో పిబిఎస్ గాయకుడిగా పరిచయమయ్యారు.

కర్ణాటక సంగీతమే కాక హిందుస్తానీలోనూ పట్టున్న ఆయన గజళ్ళను భావయుక్తంగా పాడేవారు.

తవప్పుదల్వన్ అనే తమిళ సినిమాలో ఒక సన్నివేశం. తమిళగాయకుడికీ, హిందుస్తానీ గాయకుడికీ మధ్య పోటీ.

ఇసయిలో సిరందదు తమిళ్ ఇసయే...అని ప్రారంభమయ్యే పాటలో తమిళ పాటను శివాజీపై చిత్రీకరించగా హిందుస్తానీ గాయకుడిగా నాగయ్య నటించారు. శివాజీకి టి.ఎం. సౌందరరాజన్ తమిళ పాట పాడగా, నాగయ్యకు హిందుస్తానీలో పిబిఎస్ పాడారు. ఈ పాటతో పిబిఎస్ కి మంచి ఆదరణ లభించింది.

ఎనిమిది భాషలలో తెలియడమంటే ఏదో పరిచయమని కాక ఆ భాషలను మాట్లాడగలరు. కవితలు రాయడమూ తెలిసిన వారు.

హృదయాన్ని హత్తుకునేలా పాడటం, కరిగించేలా పాడటం ఆయన స్వరానికున్న ప్రత్యేకత.

మాట్లాడుతున్నప్పుడు గొంతు ఎంత ఘనీగా ఉంటుందో పాడుతున్నప్పుడు పరవశించిపోవడం శ్రోతల వంతు.

తమిళంలో జెమినీగణేశ్ కి, ఎ.ఎం. రాజాకి ఆయన గొంతు సరిపోతుందని అనుకున్న రోజులున్నాయి. ఆయన "వీరపాండ్య కట్టబొమ్మన్" సినిమాలో "ఇన్బం పొంగుం వెన్నిలా వీసుదే..." అనే పాటను ఆయనతో మొదటిసారిగా జెమినీ గణేశ్ కి పాడించారు జి. రామనాథన్. అప్పటి నుంచీ ఆయన ఎక్కువ పాటలు జెమినీగణేశ్ కి పాడారు.

పిబిఎస్ పాడిన తమిళంలో "మయక్కమా కలక్కమా? మనదిలే కుయప్పమా" పాడిన పాట వింటుంటే మనసు కరిగిపోతుందనడం అతిశయోక్తి కాదు.

పిబిస్ – ఎస్పీబి

అనే అక్షరాలలో ఉన్న సారూప్యానికి "పాడం నిలా బాలు" ( తమిళంలో ఎస్. పి. బి. ని ఇలా పిలిచేవారు) అయిన ఎస్ పి బి తనను పిబిఎస్ అభిమానిగా చెప్పుకునేవారు.

చలనచిత్ర పరిశ్రమలో అవకాశంకోసం మెల్లిసై మన్నర్ ఎం.ఎస్. విశ్వనాథన్ దగ్గరకు వెళ్ళినప్పుడు తాను పిబిఎస్ వీరాభిమానినని, ఆయన పాటలను అక్షరం పొల్లుపోకుండా తాను పాడగలనని ఎస్.పి.బి. పాడి వినిపించిన పిబిఎస్ పాట "నిలవే ఎన్నిడం నెరుంగాదే...!" ఇక్కడో విషయం చెప్పుకోవాలి. విచిత్రమేమంటే ఎంజీఆర్ కి ఎస్.పి.బి. పాడిన తొలి పాట "ఆయిరం నిలవే వా...." అనే పాట పాడటం. పిబిఎస్సేమో జాబిల్లి దగ్గరకు రావద్దనే అర్థంలో పాట పాడగా, ఎంజీఆర్ ఆ జాబిల్లిని రమ్మని పాడారు.

కన్నడ సూపర్ స్టార్ రాజకుమారుకి పిబిఎస్ పాడిన పాటలనేకం. ఆ పాటలన్నీ కన్నడంలో సూపర్ డూపర్ హిట్. అయితే ఓ చిరు మనస్తాపంతో పిబిఎస్ గళం వద్దంటూ రాజకుమార్ తానే సొంతంగా పాడటం మొదలుపెట్టారు. అయితే పీబిఎస్ అందుకు కోపమో బాధో పడలేదు. రాజకుమార్ ఓ గొప్ప గాయకుడని, ఆయన గళం గంభీరమైనదని పీబిఎస్ ప్రశంసించారు.

తనకు తెలిసిన భాషలలో కోకొల్లలుగా కవితలు పాటలు రాసిన పిబిఎస్ ఏ కార్యక్రమంలో పాల్గొన్నా ఆ కార్యక్రమం గురించి ఓ పాట రాసి వినిపించడం ఆయనకు మహా ఇష్టం. మా నాన్నగారి ఓ పుస్తకావిష్కరణలోనూ ఆయన పద్యాలు సమర్పిస్తూ పాడటం ఇప్పటికీ నాకు గుర్తే.

పరిచయస్తుల పుట్టినరోజులకు, వివాహాలకూ ఆయన తన కలంతో శుభాకాంక్షలు అందించేవారు.

ఆయన రాసే పాటలలో ఓ కొత్తదనముండేది. అదేంటంటే ఆ పాట పదిహేను పంక్తులలోనో ఇరవై పంక్తులలోనో ఉంటే ఒక్కొక్క పంక్తి నుంచి అయిదో అక్షరాన్ని మాత్రం కలిపితే ఆ కార్యక్రమానికి సంబంధించిన లేదా ఆ కార్యక్రమ నాయకుడికి ఆశీస్సులందించే రీతిలో ఓ వాక్యం వచ్చేలా రాయడం ఆయన ప్రత్యేకత.

ఆయన చొక్కా జేబునిండా పెన్నులుండేవి. అవికూడా వేర్వేరు రంగు సిరాలతో కూడినవి.

ఆయనకు మద్రాసులో ఇష్టమైన రెస్టారంట్ "ఉడ్ ల్యాండ్స్ డ్రైవిన్" ఆయన రాకకోసం ఎందరో అక్కడికి వచ్చి నిరీక్షించేవారు.

వేసుకునే దుస్తులపట్ల ఎంతో శ్రద్ధ. ఎంజీఆర్ కి తెల్ల టోపీ గుర్తయితే పిబిఎస్ నలుపు తెలుపు కలిసిన టోపీని చాలా కాలం వాడారు. తర్వాత దానిని మానేసి బంగారు మెరుపులతో తళతళలాడే తలపాగాను ధరించారు.

"చక్రవర్తిలా డ్రెస్సు ధరించాలి – సామాన్యుడిలా మెలగాలి" అనేది ఆయన తీరు. ఆ మేరకు ఆయన అందరితోనూ సౌమ్యంగా మాట్లాడేవారు. ప్రియంగా పలకరించేవారు. ఈ విషయంలో ఆయనకాయనే సాటి.

ఆయన పాడిన తమిళ పాటలన్నీ ఇష్టమే. వాటిలో మరీ ఇష్టమైనది..."నినైత్తదెల్లాం నడందు విట్టాల్....దెయ్వం ఏదు మిల్లయ్..." అనే పాట మరీ మరీ ఇష్టం నాకు. (అనుకున్నవన్నీ జరిగితే దైవమనేదే లేదు...)

**– యామిజాల జగదీశ్**

# సుధామూర్తి మానవత్వం



అది బెంగళూరుకు వెళ్తున్న రైలు. రద్దీగా ఉంది. సెకండ్ క్లాస్ బోగీలో టీసీ చెక్ చేస్తుండగా ఓ పదమూడేళ్ళమ్మాయి పట్టుబడింది. ఆ పిల్లను ఆనాల్సిన నాలుగు మాటలూ అని మరికాసేపట్లో వచ్చే స్టేషన్లో దిగిపొమ్మని కటువుగా చెప్పాడు టీసీ.

ఆ మాటలకు బిక్క మొహం వేసుకుందా పిల్ల.

ఇంతలో అదే బోగీలో ప్రయాణిస్తున్న సుధామూర్తి (ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తిగారి భార్య) ఈ సన్నివేశాన్ని చూశారు. ఆమె టీసీతో "అంతా చూస్తూనే ఉన్నానండి. ఉన్నట్టుండి ఇలా మధ్యలో ఆ పిల్లను దిగిపొమ్మంటే ఎలా చెప్పండి. ఈ రైలు ఎక్కడి వరకూ వెళ్తుందో అక్కడిదాకా ఈ పిల్లకు టిక్కెట్ ఇవ్వండి. జరిమానాతోపాటు డబ్బు నేనిస్తాను" అన్నారు.

"వద్దండి. ఇలాంటి వాళ్ళకు సాయం చేయకండి. ఇలా మీరు చేశారని తెలిస్తే మరొకరిలా టిక్కెట్ లేకుండా ఎక్కుతారండి. ఇలాంటి వాళ్ళ పట్ల జాలి , దయా వంటివి చూపకూడదు" అని టీసీ గట్టిగా అంటున్నాడు.

అయినా ఆమె అవన్నీ పట్టించుకోకుండా ఆ అమ్మాయికి టిక్కెట్ తీసిచ్చారు.

ఆ తర్వాత సుధామూర్తి ఆ పిల్లను చేరదీసి అడిగారు ఎక్కడి నుంచి వస్తున్నావని. ఎవరూ ఏమిటి అనే వివరాలు అడిగారు.

ఆ అమ్మాయి చెప్పడం మొదలు పెట్టింది.

ఆ అమ్మాయి ఇంట్లోంచి పారిపోయి వచ్చింది. ఆమె తండ్రి తన తల్లి చనిపోవడంతో మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆయన కొన్ని రోజుల క్రితం చనిపోయాడు. తండ్రి ఉన్నంత కాలం సవతి తల్లి ఈ అమ్మాయిని బాగానే చూసుకుంది. తండ్రి పోయిన తర్వాత ఆ సవతితల్లి నానా మాటలు అనడం, కొట్టడం చేస్తోంది. దాంతో ఆ నరకయాతన భరించలేక ఈ అమ్మాయి పారిపోయి ఈ రైలెక్కింది. లక్ష్యం లేని దారీ తెన్నూ తెలియని జీవన ప్రయాణం ఆమెది.

సుధామూర్తి ఆమె చెప్పిందంతా విన్నారు.

బెంగుళూరూ స్టేషన్లో రైలు ఆగింది.

ప్రయాణికులు దిగిపోతున్నారు. సుధామూర్తి కూడా దిగిపోయారు. ఆమెకోసం కారు ఆగి ఉంది. ఆ కారులో ఎక్కబోతున్న సుధామూర్తి కళ్ళు ఆ అమ్మాయికోసం చూశాయి. ఆ పిల్ల అక్కడే ఓ మూల నిల్చునుంది. ఆమె దగ్గర ఏమీ లేదు. కట్టుబట్టలతో వచ్చిన పిల్ల.

సుధామూర్తి దగ్గరకెళ్ళి ఆ పిల్లను చేయి పట్టుకుని తనతో కారులో ఎక్కించుకున్నారు.

దార్లో తన మిత్రుడు నడుపుతున్న అనాథాశ్రమానికి కారును మళ్ళించింది. అక్కడ మిత్రుడితో ఆమ్మాయి విషయం చెప్పారు సుధామూర్తి.

ఆ తర్వాత ఆమె మిత్రుడికి థాంక్స్ చెప్పి ఇంటికి వెళ్ళిపోయారు.

ఆ మిత్రుడు ఆ అమ్మాయిని తన హోమ్ లో చేర్చుకున్నాడు. అమ్మాయికి చదివించారు. ఆమెకు ఓ పెద్ద సంస్థలో ఉద్యోగం వస్తుంది. కంపెనీ వాళ్ళే ఆ పిల్లను అమెరికా పంపించారు. ఈ కాలమంతా గిర్రున తిరిగింది.

అమెరికాలో ఉన్న కన్నడం వాళ్ళు ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సుధామూర్తిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆమె ఆ కార్యక్రమం కోసం అమెరికా వెళ్ళారు. అక్కడ ఒక అమ్మాయి దగ్గరుండి సుధామూర్తికి అవసరమైన ఏర్పాట్లన్నీ చూసారు. అంతేకాదు ఆఖరిరోజు సుధామూర్తి లాడ్జింగుకి కట్టాల్సిన బిల్లు కోసం కౌంటర్ కి వెళ్ళారు. అయితే కౌంటర్లోని వారు "వద్దండి. మీ బిల్లంతా ఓ అమ్మాయి కట్టాశారండి" అన్నారు.

"ఎవరా అమ్మాయి? చెప్పగలరా? " అని సుధామూర్తి అడగ్గా ఓ రెండు మూడు అడుగులు వెనకే ఉన్న అమ్మాయిని చూపించారు.

"మీరెందుకమ్మా నా ఖర్చుకి పే చేశారు" అని అడగ్గా ఆ అమ్మాయి ఒక్కసారి రైల్లో టిక్కెట్ లేకుండా ప్రయాణం చేస్తూ టీసీకి దొరికిపోయిన దగ్గర్నించి ఇప్పుడు బిల్లు పే చెయ్యడం దాకా తన జీవితంలో జరిగిన సంఘటనలను చెప్తూ ఆ పిల్ల తానేనని అంది.

"మీకు నేను జీవితాంతం రుణపడి ఉంటాను. కనీసం నాకు ఈ ఒక్క చిన్ని అవకాశమైనా కలిగింది....మీ బిల్లు నేను పే చెయ్యడం చాలా చిన్నది. నావల్ల అయిందిదే" అంటూ ఆ పిల్ల సుధామూర్తి కాళ్ళకు దణ్ణం పెడుతుంది.

ఆ పిల్లను చూసి సుధామూర్తి ఆశ్చర్యపోయారు. ఆమెను గట్టిగా హత్తుకున్నారు. ఇద్దరి కళ్ళల్లోనూ అప్రమేయంగా కన్నీళ్ళు కారాయి..

అందుకే సహాయం చెయ్యాలి.. ఒక వేళ వారు మోసం చేస్తే వాళ్ళు ఏనాటికైనా ఖర్మ అనుభవిస్తారు.. నిజంగా వారి అవసరత నిజమైతే ఒక జీవితమే మన వల్ల ఆనందిస్తుంది.

# చరిత్రలో ఈ రోజు (మే 22)

**సంఘటనలు:**

0334 : బి.సి. అలెగ్జాండర్ ది గ్రేట్, పెర్షియన్ రాజు డారియస్ 3 ని, టర్కీ లోని గ్రేనికస్ అనే చోట ఓడిరచాడు.

0337 : కాన్ స్టాంటిన్ ది గ్రేట్ మరణించాడు. ఇతడు, తన రాజ్యంలో క్రైస్తవ మత వ్యాప్తికి చాలా తీవ్రంగా కృషి చేసాడు.

1216: ఫ్రెంచ్ సైన్యపు దళాలు ఇంగ్లాండ్ భూభాగం మీద కాలు పెట్టాయి.

1455: 30 సంవత్సరాల వార్స్ ఆఫ్ రోజెస్ యుద్ధం మొదల్కెన రోజు.

1570: మొట్టమొదటి ఆధునిక అట్లాస్, 70 పటాలు (మేప్స్ ) తో అబ్రహం ఓర్టెలియస్ , అనే, ఫ్లెమిష్ కార్టోగ్రాఫర్ (పటాల రూపకర్త) బెల్జియంలో ప్రచురించాడు.

1761: యున్కెటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో మొదటి జీవిత బీమా పాలసీని ఫిలడెల్ఫియాలో జారీ చేసారు.

1841: ఫిలడెల్ఫియా ( పెన్సిల్వేనియా రాష్ట్రం) కి చెందిన హెన్రీ కెన్నెడీ, మొట్ట మొదటి ఆధునిక కుర్చీ ( వంగిన భాగాలతో తయారు చేసింది. పడక కుర్చీ, (రిక్లైనింగ్ చెయిర్ ) కోసం ఒక పేటెంట్ పొందాడు.

1849: అబ్రహం లింకన్, తేలియాడే (మునగని) డ్రై డాక్ (ఫ్లోటింగ్ డ్రైడాక్ ) కోసం పేటెంట్ నంబర్ 6469 అందుకున్నాడు.

1972: సిలోన్ ద్వీపం కొత్త రాజ్యాంగం అమలు చేయటంతో, పేరు మార్చుకుని, రిపబ్లిక్ ఆఫ్ శ్రీలంక గా మారింది

2004: భారత 13వ ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ నియమితులయ్యారు

2008: నెల్లూరు జిల్లాను పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది

2009: భారత ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ రెండోసారి ప్రమాణస్వీకారం. ఎక్కువకాలం, ప్రధాని పదవిలో ఉన్న మూడవ ప్రధాని (2639 రోజులు). (మొదటి ప్రధాని 6130 రోజులు. రెండవ ప్రధాని 5829 రోజులు).

2010: మంగళూరు విమానాశ్రయంలో విమానం కూలి 158 మంది మృతి

**జననాలు:**

1783: విలియం స్టర్జియన్ , మొదటి ఆచరణాత్మకమైన, విద్యుదయస్కాంతం నిర్మాత, ఆంగ్ల శాస్త్రవేత్త.

1822: పరవస్తు వెంకట రంగాచార్యులు, సంస్కృతాంధ్ర పండితుడు.

1828: ఆల్ బ్రెచ్ట్ గ్రాఫె, ఆధునిక నేత్ర వైద్యమును అభివృద్ధి చేసిన మొదటి నేత్ర వైద్యుడు.

1859: సర్ ఆర్థర్ కానన్ డోయల్, షెర్లాక్ హోమ్స్ అనే అపరాధ పరిశోధకుని సృష్టికర్త.

1951: మంద జగన్నాథం రాజకీయ నాయకుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు

1955: పి. చంద్రశేఖర అజాద్, కథా రచయిత, నవలారచయిత.

1957: సీమ, భారతీయ సినిమా నటి (మళయాళ దర్శకుడుఐ.వి.శశి భార్య)

**మరణాలు:**

1885: విక్టర్ హ్యూగో, ఫ్రెంచ్ రచయిత

1960: మేడవరము సుబ్రహ్మణ్యశాస్త్రి, సంస్కృతాంధ్రాలలో గొప్ప పండితుడిగా పేరుగాంచిన వ్యక్తి.

2002: మందులు.కె రంగస్థల నటుడు, దర్శకుడు.

2010: వేటూరి సుందరరామ్మూర్తి, సుప్రసిద్ధ తెలుగు సినిమా పాటల రచయిత.

2019: చెరుకుమల్లి సూర్యప్రకాశ్ అంతర్జాతీయ స్థాయి ఆయిల్, అక్రిలిక్, అబ్‌స్ట్రాక్ట్ చిత్రకారుడు.

2023: కేతు విశ్వనాథరెడ్డి, తెలుగు రచయిత

2023: శరత్ బాబు, తెలుగు సినిమా నటుడు

2nd pages111.qxd 5/21/2025 8:15 PM Page 5



# రాజాం ఆర్మీ జవాన్‌కు సన్మానం



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** నేడు జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాజాం గ్రామం లో ఆర్మీ జవాన్ నడిపల్లి అశోక్ ను ఆకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందనలు తెలిపి, సన్మానించారు. అలాగే ఇటీవల భారత్, పాకిస్తాన్ కు జరిగిన యుద్ధానికి దగ్గరలోనే అశోక్ విధులు నిర్వర్తించారు. గత మూడేళ్లు నుండి జమ్మూ, కాశ్మీర్, శ్రీనగర్ ప్రాంతాల్లో దైర్యంగా విధులు నిర్వహించడం జరిగింది. బారా ముల్లా 10 వ సెక్టర్ 20 కిలోమీటర్లు దూరం లో టూరిస్టుల పై కాల్పులు జరగడం చాలా దారణం అని సోల్జర్ అశోక్ అన్నారు. ఆకుల మాట్లాడుతూ భారత్ ప్రధాని నరేంద్ర మోడీ చాలా చాలా ముందు జాగ్రత్త గా అన్ని ఏర్పాట్లు చేయడం వలన పాకిస్తాన్ తోక ముడిచిందని అన్నారు. జవాన్ అశోక్ బుధవారం రాజాం గ్రామానికి అక్కడ నుండి క్షేమం గా స్వగ్రామం రావడం వలన తల్లి తండ్రులు, భార్య బంధువులు, టీడీపీ యూత్ లీడర్ అండమాన్ దుర్గ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. యూత్ అందరూ కూడా జై జవాన్, జై కిసాన్, జై భారత్ అని వినాదాలు చేసారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆకుల ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించడం తో ప్రజలు అభినందనలు తెలిపారు.

# వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన విశాఖ యాదవ సంఘం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** బుధవారం విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డికి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఇటీవల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఉరుకూటి రామ చంద్ర రావు (చందు), నియమించినందుకు, నిన్న విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా మొల్లి అప్పారావు నియమించినందుకు, పార్టీ నాయకత్వానికి ముఖ్యంగా మా పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్ రెడ్డికి, శాసన మండలి ప్రతి పక్ష నేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్ కన్న బాబు, నగర అధ్యక్షులు కేకే రాజు, మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్ మా తరఫున, మరియు మా యాదవ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న విశాఖపట్నం నగర మేయర్ పదవిని ఒక యాదవ మహిళకి కేటాయించడం, ఉత్తరాంధ్రలో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం, క్యాబినెట్ స్థాయిలో చైర్మన్ పదవులు, బీసీ కార్పొరేషన్, ఇతర బోర్డులలో గౌరవ స్థానాలు కేటాయించడం ు ఇవన్నీ యాదవ సామాజికవర్గానికి ఇచ్చిన గుర్తింపు యొక్క నిదర్శనాలు. జగనన్న మాకు ఇచ్చిన గౌరవాన్ని మేము మరిచిపోలేం. మా ఊపిరి ఉన్నంతవరకు విశాఖపట్నం జిల్లాలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం, జగన్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అహర్నిశలు పనిచేస్తాం. – పల్లా దుర్గ రావు, జిల్లా అధికార ప్రతినిధి జగన్ మోహన్ రెడ్డి యాదవ వర్గానికి ఎప్పటినుంచో గౌరవం కల్పిస్తూ, 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మొదలుపెట్టిన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, 2014, 2019 ఎన్నికలలోను, అలాగే 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాతా కూడా మేయర్, డిసిఎంఎస్ చైర్మన్, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు వంటి కీలక పదవులు యాదవులకు కేటాయిస్తూ నిరంతరంగా ప్రోత్సహించారు. ప్రస్తుతం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుల వంటి కీలక సమస్యలపై, పార్టీ మార్గదర్శకత్వంలో పెద్దఎత్తున పోరాట కార్యక్రమాలు చేపడతాం. ప్రత్యేకంగా కార్మికుల దీక్షకు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేస్తున్నాను. ఉరుకూటి రామ చంద్ర రావు (చందు), జిల్లా పార్టీ యువజన్ విభాగం అధ్యక్షులు.

ఈ సమావేశం లో మాజీ రాష్ట్ర మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు పితల గోవింద్ , పితల శ్రీనివాస్ , మువ్వల సంతోష్ , కొయ్య చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాలకు కేటాయించిన నిధులు వినియోగంలో సమన్వయంతో పని చేయాలి

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** గ్రామీణ ప్రాంతంలో రైతుల వ్యవసాయానికి సాగునీరు అందించడానికి గ్రామాలలో సాగునీటి సంఘాలకు కేటాయించిన నిధులు వినియోగంలో సమన్వయంతో పని చేయాలని ఇరిగేషన్, ఎన్ఆర్జిఎస్ అధికారులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశించారు. బుధవారం అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇరిగేషన్ డిఈ స్వామినాయుడు, ఎన్ఆర్జిఎస్ క్లస్టర్ ఇంచార్జ్ కుమార్, అనకాపల్లి, కసింకోట ఏపిఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో రైతుల వ్యవసాయానికి సాగునీరు అందించడానికి గ్రామాలలో సాగునీటి సంఘాలకు కేటాయించిన నిధులు వినియోగంలో రెండు డిపార్ట్మెంట్లు సమన్వయంతో పని చేస్తే రైతులకు సాగునీరు అందించడం సులభం అవుతుందని అన్నారు ఎన్ఆర్జిఎస్ ద్వారా గ్రామాలలో పంట కాలవల పూడికతీత, మట్టిపని చేయడం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు గ్రామాలలో ఉన్న సాగునీటి సంఘాల కాలువలలో ఆక్రమణలకు గురికాకుండా మార్కింగ్ చేయాలని ఆదేశించారు. ఈ వర్షాకాలం ముందే రెండు డిపార్ట్మెంట్లో సమన్వయంతో పనిచేసి రైతులకు సాగునీరు అందించే విధంగా పనిచేయాలని. రైతుల, సాగునీటి సంఘాల సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చదరం నాగేశ్వరావు, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు అడ్డురోడ్డులో టీడీపీ జిల్లా మినీ మహానాడు

## జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా మినీ మహానాడు, పాయకరావుపేట నియోజకవర్గం అడ్డురోడ్డ జంక్షన్ లో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో మినీ మహానాడు 22 వ తేదీ న గురువారం ఉదయం 9:30 కు ప్రారంభమవుతుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు తెలియజేశారు. ఈ మహానాడు సమావేశమునకు ముఖ్యఅతిధులుగా , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొంటున్న ఈ సమావేశానికి జిల్లా శాసన సభ్యులు, మాజీ శాసనసభ్యులు, మాజీ శాసన మండలి సభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జులు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమమునకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యులు, వివిధ మండల ఎంపీపీలు, జడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పిటిసిలు, మార్కెట్ కమిటీ, డీసీఎంఎస్ చైర్మన్లు, గతంలో నిర్వహించిన వివిధ ప్రభుత్వ రంగ సంస్థల మాజీ చైర్మన్లు, వివిధ కులాల రాష్ట్ర డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గం జిల్లా అనుబంధ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, పాల్గొనవలసిందిగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల తాతయ్యబాబు, లాలం కాశినాయుడు తెలియజేశారు.

# టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడుగా కర్రి వెంకట సన్యాసి నాయుడు

● ఏకగ్రీవంగా ఎన్నికున్న మండల టీడీపీ శ్రేణులు.. ● అంచలంచెలుగా ఎదిగిన వైనం.. ● తుమ్మపాల సర్పంచ్ గా, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ తో పాటు పార్టీలో పలు పదవులు.... ● మినీ మహానాడు సభలో అనకాపల్లి మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం....



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) అనకాపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి జరిగిన మినీ మహానాడులో ప్రకటించారు. కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చేరి అంకిత భావంతో పనిచేశారు. తెలుగుదేశం అధినాయకత్వం వద్ద క్రమశిక్షణ గల నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. దీంతో ఆయనకు పలు పదవులు వరించాయి. 1990లో డి ఆర్ సి( రైల్వే) మెంబర్గా, 1992లో జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్గా నియమితులయ్యారు. అలాగే 1995 నుంచి 2000 వరకు తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 2006 నుంచి 2011 వరకు తుమ్మపాల గ్రామ సర్పంచ్ గా ఎన్నికై అందరి మన్ననలు చూరగొన్నారు. అలాగే పార్టీలో పలు పదవులు నిర్వహించిన బాబి టిడిపి మండల పార్టీ అధ్యక్షునిగా నియమితులు కావడం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్న వారికి తప్పకుండా పార్టీ గుర్తిస్తుందని, పదవులు వరించే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ మరియు మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ పీలా గోవింద సత్యనారాయణ,టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు. పార్టీ అభివృద్ధికి తన శక్తి వంచన మేరకు పని చేస్తానని తెలియజేశారు. వీరితో పాటు మండల ఉపాధ్యాక్షులుగా దాడి పెంటారావు, మండల ప్రధానకార్యదర్శిగా నంబారి శ్రీనులను టీడీపీ శ్రేణులు ఎన్నుకున్నారు. వీరితో పాటు మండల టీడీపీ కార్యవర్గం కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

# మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన

## బిల్లు వేతనాలు వెంటనే విడుదల చేయండి




**చోడవరం, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారంనాడు మధ్యాహ్న భోజన కార్మికులకు గత జనవరి నుండి బిల్లులు వేతనాలు వెంటనే విడుదల చేయాలని స్థానిక ఎంఈఓ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ, సకాలంలో బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది అని,తొమ్మిది పది తరగతులకు సంబంధించి డిసెంబర్ నెల నుండి బిల్లులు రాలేదనీ, ఐదు నెలలు బిల్లులు వేతనాలు రాకపోతే మధ్యాహ్న భోజన కార్మికులు ఎలా వంట చేసి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతినెల 15వ తారీకు బిల్లులు వచ్చేవని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెలలు తరబడి వేతనాలు కానీ, బిల్లులు గాని ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. మౌలిక వసతులు లేకపోయినప్పటికీ, కార్మికులకు ఉద్యోగ భద్రత ప్రమాద బీమా సౌకర్యం కనీస వేతనాలు లేకపోయినప్పటికీ, ఇదే ఉపాధిని నమ్ముకుని పనిచేస్తున్న కార్మికులను కి అప్పుల ఊబిలోకి ప్రభుత్వం నెట్టేస్తుంది అని, రకరకాల మెనూల పేర్లతో కార్మికులపై పనిబారాన్ని పెంచుతున్న ప్రభుత్వం సకాలంలో బిల్లులు ఇవ్వడంలోని విఫలమైందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఐదు నెలల బకాయి బిల్లులు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు జి లక్ష్మి నారాయణమ్మ ఎర్రయ్యమ్మ, బీ లక్ష్మి, దేవుడమ్మ , సత్యవతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిరివెన్నెల సీతారామ శాస్త్రి 70 వ జయంతి మహోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** అనకాపల్లి పట్టణంలోని స్థానిక సత్యాస్ లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో మాజీమంత్రి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో సిరివెన్నెల సీతారామ శాస్త్రి 70 వ జయంతి వేడుకలు చాలా ఘనంగా జరిగాయి, ఈ వేడుకలకు ముఖ్యఅతిధులు గా ప్రముఖ సినీ గేయ రచయిత, సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి, రచనా రాజహంస ఎర్రప్రగఢ రామకృష్ణ, యర్రంశెట్టి సత్యారావు మాస్టర్, సీతారామ శాస్త్రి సోదరులు శ్రీరామశాస్త్రి, వేంకట శాస్త్రి, సీతారామ శాస్త్రి సతీమణి పద్మావతి హాజరు అయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమం ప్రారంభించారు. తదుపరి గాయకులు సీతారామ శాస్త్రి రచనలు అందించిన పాటలు పాడారు. పౌర్ణమి చిత్రంలో భారత వేదమునా పాటకు డాన్స్ మాస్టర్ సురేష్ సారద్యం నాట్యప్రదర్శన జరిగిన తర్వాత వేంకట శాస్త్రి అధ్యక్షత న సమావేశం ప్రారంభం అయ్యి చాలా అట్టాసంగా సాగింది. సభలో సభ్యులు, ప్రేక్షకులు అందరు దాదాపుగా 4 గంటల పాటు అలాగే ఉండిపోయారు వక్తలు మాట్లాడుతూ సీతారామ శాస్త్రి ప్రస్థానం, ప్రయాణం, సాధించిన విజయాలు, తెలుగు సాహిత్యం పై ఆయనకు ఉన్న మక్కువ కోసం వివరిస్తూ అయన జయంతి మహోత్సవాన్ని ఇంత ఘనంగా ఏర్పాటు చేసిన కొణతాల రామకృష్ణ ఔన్నాత్యాన్ని, ఆలోచనలని కీర్తిస్తూ ప్రసంగాలు జరిగాయి. రచనా రాజహంస ఎర్రప్రగఢ రామకృష్ణ మాట్లాడుతూ రామకృష్ణ ఉద్దేశిస్తూ "శ్వేత కపోతం" అని అన్నారు. నేటి రాజకీయ పరిస్థితులలో ఒక మాట ఎవరిపైన తులకుండా, ఒక మచ్చ లేకుండా, చిన్నపాటి సంయమనం కోల్పోకుండా రాజకీయాలలో అత్యంత విలువలతో జీవించడం చాలా కష్టం అని అలాంటి వ్యక్తి కొణతాల రామకృష్ణ అని అన్నారు. రామజోగయ్య శాస్త్రి కూడా చాలా అద్భుతమైన ప్రసంగం అందించారు. కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా శ్రీరామశాస్త్రి రచించిన 'మనిషికి మరమ్మత్తు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు, కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ సీతారామ శాస్త్రి గొప్ప రచయితే కాకుండా గొప్ప దేశ భక్తి కలవారు అని అయన రచనలు ద్వారా వచ్చిన పాటలు, సాహిత్యం సమాజాన్ని తట్టి లేపే విధంగా ఉంటాయని అలాంటి వ్యక్తి అనకాపల్లి లో పుట్టడం ఈ ప్రాంత వాసి కావడం అయన ఘనత ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించడం అనకాపల్లి ప్రజలు అందరికి గర్వకారణం అని అన్నారు. సిరివెన్నెల కళాపీఠం ఏర్పాటు చేసి వచ్చే ఏడాది నాటికీ " తానా " సభ్యులతో సంయుక్తంగా అనకాపల్లిలో సీతారామ శాస్త్రి విగ్రహ ఏర్పాటు కూడా చేస్తామని ప్రకటించారు. ఈ ప్రకటన మొత్తం సభలో అందరికి ఒక తెలియని అనుభూతి ఇచ్చింది తదుపరి రామజోగయ్య శాస్త్రి కి సిరివెన్నెల సీతారామ శాస్త్రి స్మారక పురస్కారం Anxiety సత్కరించారు. వచ్చిన అతిధులు అందరికి సీతారామ శాస్త్రి జ్ఞాపికలు అందచేశారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

# డీఎస్సీ - సోషల్

## స్థానిక స్వపరిపాలన

1. మూడంచెల పంచాయతీరాజ్ విధానాన్ని సూచించిన కమిటీ ఏది?
జ: బల్వంత్‌రాయ్‌మెహతా
2. గ్రామ ఓటర్లు గ్రామ సర్పంచ్‌ను ఎన్నుకొనే పద్ధతి–
జ: రహస్య ఓటింగ్ పద్ధతి
3. మనదేశంలో 'మూడంచెల పంచాయతీరాజ్' వ్యవస్థను మొదట ఏర్పాటు చేసిన రాష్ట్రమేది?
జ: రాజస్థాన్
4. గ్రామ పంచాయతీ ఆవశ్యకతను తెలిపే ఆదేశ సూత్రాల్లోని అధికరణ–
జ: 40
5. గ్రామీణ స్వపరిపాలనా సంస్థల్లో దేన్ని ప్రాథమిక స్వపరిపాలనా సంస్థ అని పిలుస్తారు?
జ: గ్రామ పంచాయతీ
6. ఒక గ్రామంలోని మొత్తం వయోజనులు 500 మంది. ఈ గ్రామానికి పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌తో కలిపి ఎంతమంది సభ్యులను ఎన్నుకోవాలి?
జ: 7
7. 2001 జనాభా లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో ప్రస్తుతమున్న మండల పరిషత్‌ల సంఖ్య–
జ: 1125
8. మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎలా ఎన్నుకుంటారు?
జ: మండల పరిషత్ సభ్యులు
9. మండల పరిషత్ సమావేశాల్లో పాల్గొనే అధికారం ఉండి, ఓటుహక్కులేనివారు ఎవరు?
జ: మండలానికి చెందిన గ్రామ సర్పంచ్‌లు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి
10. ఏ చట్టం ద్వారా మండల పరిషత్ ఏర్పడింది?
జ: 1986 చట్టం
11. మండలంలోని ప్రభుత్వ సిబ్బంది మొత్తం ఎవరి పర్యవేక్షణలో పనిచేస్తారు?
జ: మండల పరిషత్ అభివృద్ధి అధికారి
12. మండల స్థాయిలో పాఠశాల మధ్యాహ్న ఉచిత భోజనం ఎవరి పర్యవేక్షణలో ఉంటుంది?
జ: తహశీల్దారు
13. గ్రామసభ సంవత్సరంలో ఎన్నిసార్లు సమావేశం కావాలి?
జ: రెండు
14. రాజ్యాంగంలోని ఏ సవరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించారు?
జ: 73

## విజయనగర సామ్రాజ్యం

1. విజయనగర సామ్రాజ్యం స్థాపించిన సంవత్సరం?
జ: క్రీ.శ. 1336
2. ఏ ఢిల్లీ సుల్తాన్ కాలంలో విజయనగర సామ్రాజ్యం ఏర్పాటైంది?
జ: మహ్మద్ బిన్ తుగ్లక్
3. విజయనగర సామ్రాజ్యాన్ని ఏ నదిఒడ్డున స్థాపించారు?
జ: తుంగభద్ర
4. సంగమ వంశంలో గొప్పవాడు?
జ: రెండో దేవరాయలు
5. పారశీక రాయబారి అబ్దుల్ రజాక్ ఏ విజయనగర చక్రవర్తి కాలంలో విజయనగరాన్ని సందర్శించాడు?
జ: రెండో దేవరాయలు
6. విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన వంశాల వరుస క్రమాన్ని గుర్తించండి.
1. సంగమ 2. తుళువ 3. అరవీటి 4. సాళువ
జ: 1, 4, 2, 3
7. శ్రీకృష్ణదేవరాయలు ఏ సంవత్సరంలో పోర్చుగీసువారితో సంధి చేసుకున్నాడు?
జ: క్రీ.శ. 1510
8. శ్రీకృష్ణ దేవరాయలు విజయస్తంభాన్ని ఎక్కడ ఏర్పాటు చేశాడు?
జ: సింహాచలం
9. శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగరాన్ని సందర్శించిన విదేశీయుడు ఎవరు?
జ: డోమింగ్ పేయిజ్
10. ఆముక్తమాల్యద రచయిత ఎవరు?
జ: శ్రీకృష్ణదేవరాయలు
11. శిల్పులు రామాయణగాథను ఏ ఆలయ గోడలపై చెక్కారు?
జ: హజార రామాలయం
12. తల్లికోట యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
జ: క్రీ.శ. 1565
13. కృష్ణదేవరాయల పండిత సభను ఏమనేవారు?
జ: భువన విజయం
14. శ్రీకృష్ణదేవరాయలు ఏ సంవత్సరంలో మరణించాడు?
జ: క్రీ.శ. 1529
15. విజయనగర రాజ్య ముఖ్య ఉద్దేశం?
జ: హిందూ ధర్మరక్షణ
16. ఏ వంశం రాజుల కాలం నుంచి వైష్ణవం బాగా వాడుకలోకి వచ్చింది?
జ: సాళువ

# 25 వరకు అన్నదాత సుఖీభవ పథకం వెరిఫికేషన్ పొడిగింపు

## మండల వ్యవసాయ అధికారి బి. భాస్కరరావు

**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన వివరములు వెరిఫికేషన్ చేయుటకు తుది గడువు ఈ నెల 25 వ తేదీ వరకు పొడిగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి బి. భాస్కరరావు తెలిపారు. రైతులందరూ కూడా ఈ గడువు లోపల వారికి సంబంధించిన రైతు సేవ కేంద్రాలలో వ్యవసాయ శాఖ సిబ్బందికి వారి యొక్క ఆధార్ జిరాక్స్,1బి జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ మొదట పేజీ జిరాక్స్ త్వరితగతిన సమర్పించాలని ఏఓ కోరారు.

2nd pages111.qxd 5/21/2025 8:15 PM Page 6



# 98 చోరీ కేసుల్లో 81మంది అరెస్టు

## రూ.1.05కోట్ల సొత్తు స్వాధీనం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏప్రిల్ నెలలో 123 చోరీ కేసులు నమోదు కాగా 98 కేసులను క్రైమ్ పోలీసులు ఛేదించారని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వెల్లడించారు. ఆయా కేసుల్లో 81 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. మంగళవారం ఉదయం పోలీసు సమావేశమందిరంలో నిర్వహించిన రికవరీ మేళాలో ఆయన మాట్లాడారు.

రికార్డు స్థాయిలో రూ.1.05కోట్ల విలువైన చోరీ సొత్తును రికవరీ చేసినట్లు చెప్పారు. 562 గ్రాముల బంగారు ఆభరణాలు, 701 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.7.84లక్షల నగదు, 54 మోటారు వాహనాలు, 380 సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, 4 ఏసీ యూనిట్లు, 10 బ్యాటరీలు, ఒక టీవీ తదితరాలు ఇందులో ఉన్నాయన్నారు.

నేర నియంత్రణలో భాగంగా నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో 156 అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. శివార్లలో నేరాల నియంత్రణకు పగటి సమయంలో 82 ప్రాంతాల్లో, రాత్రి సమయంలో 88 ప్రాంతాల్లో డ్రోన్‌లతో నిఘా ఉంచామన్నారు. హనీ ట్రాప్ కేసులో ఇప్పటికే కీలక నిందితులను అరెస్టు చేశామని, ఈ కేసులో బాధితులు ఎవరైనా ఉంటే ముందుకొచ్చి ఫిర్యాదు చేయవచ్చని సీపీ కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితులు ఎంతటి వారైనా అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం చోరీ సొత్తును బాధితులకు అందజేశారు. డీసీపీ (క్రైమ్) లతా మాధురి, ఏడీసీపీ మోహనరావు పాల్గొన్నారు.

# అనపర్తిలో శ్రీను పుట్టినరోజు వేడుకలు



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** అనపర్తి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి( దత్తుడు శ్రీను) పుట్టినరోజు వేడుకలు అనపర్తిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనపర్తి వర్తక సంఘం ప్రెసిడెంట్ కొవ్వూరి వెంకట్రామారెడ్డి(టైర్లు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లోముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయనకు శాలువవేసి పూలమాలతో కొవ్వూరి వెంకట్రామారెడ్డి సత్కరించి ఆహ్వానించారు. ఆయన దత్తుడు శ్రీనుని పూలమాల,దుస్సాలువా తో సత్కరించి కేక్ కట్ చేయించి,దత్తుడు శ్రీనుకి తినిపించారు. అనపర్తి మండలం నలుమూలలు నుండి విచ్చేసిన దత్తుడుశ్రీను అభిమానులు,ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు శాలువాలు,పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దత్తుడు శ్రీను తెలుగుదేశం పార్టీ కార్యకర్త స్థాయి నుండి కష్టపడి ఈరోజు నాయకుడు అయ్యారని అన్నారు. కార్యకర్తలు అంతా దత్తుడు శ్రీనుని ఆదర్శంగా తీసుకునిముందుకు సాగాలన్నారు. దత్తుడు శ్రీనుమాట్లాడుతూ మీ అభిమానానికి కృతజ్ఞుడిని మీ అందరి ఆదరాభిమానాలు, ఆశీస్సులు ఎప్పుడూ ఇలాగే నాపై ఉండాలని నాకు అప్పచెప్పిన బాధ్యతను మీ అందరి సహకారంతో సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరిసిపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానంద రెడ్డి,కర్రి వెంకట్రామారెడ్డి, తమలంపూడి సుధాకర్ రెడ్డి, వైజాగ్ శ్రీను,వర్తక సంఘం ప్రెసిడెంట్ వెంకటరామారెడ్డి,కర్రి శేషారత్నం, మల్లిడి ఆదినారాయణరెడ్డి, బాసి, ఒంటి సూర్య ప్రకాష్, నూతిక బాబురావు, రాయి జాన్ తదితరులు పాల్గొన్నారు.

# సినీ గేయ రచయిత వేటూరి సుందర రామమూర్తి



## నేడు వర్ధంతి

ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందర రామమూర్తి జనవరి 29, 1936 న కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెద కళ్లేపల్లి లో జన్మించారు. మద్రాసు లోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల లో ఇంటర్మీడియట్, బెజవాడ లో డిగ్రీ పూర్తిచేశారు. ఆంధ్ర ప్రభ పత్రిక ఉప సంపాదకుడిగా కొంతకాలం పనిచేశారు. వీరు ద్వైతా గోపాలం వద్ద ఆ తరువాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. తొలినాళ్ళలో 1956 నుంచి దాదాపు పదహారేళ్ళ పాటు పాత్రికేయునిగా పనిచేశారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వహించిన ఓ సీత కథ చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. వేటూరి అనగానే వెంటనే స్ఫురించేది అడవి రాముడు,శంకరాభరణం ఇంకా సిరి సిరి మువ్వ, సాగర సంగమం, సప్త పది, సీతాకోక చిలుక, ముద్ద మందారం, సితార, అన్వేషణ, స్వాతిముత్యం....ఇలా ఎన్నో సినిమాలు....ఈ సినిమాల లోని అందమైన అద్భుతమైన పాటలు. వేటూరి చాలా రకాల పాటలు రాశారు. సంప్రదాయ కవిత్వం దగ్గర నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. వీరు కొన్ని వేల పాటలు రాశారు. వీరు ఎనిమిది నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం( మాతృ దేవో భవ చిత్రం...లో రాలిపోయే పువ్వా నీకు...) అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరి నే. వీరు 'సిరికా కొలను చిన్నది', 'కొమ్మ కొమ్మకో సన్నాయి' వంటి రచనలు చేశారు. వీరు చివరిగా బద్రినాథ్ చిత్రానికి పాటలు రాశారు. 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న వీరు మరణించారు.

**డా.జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**9490833108, పైడిమెట్ట.**

# ఉపాధి ఉసురు తీస్తున్న కేంద్ర ప్రభుత్వం

● పది వారాలుగా బిల్లులు నిల్ ● యుక్త ధారయాప్ ద్వారా ఏ ప్రాంతంలో ఎప్పుడు పని చేయాలో నిర్దేశించనున్న కేంద్రం ● రాష్ట్రాల హక్కులకు మంగళం పాడే దిశగా సంస్కరణలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టానికి కేంద్రం ప్రభుత్వ ఉసురు తీస్తు చట్టానికి తూట్లు పొడుస్తోందని,ఇప్పటి వరకు పది వారాలు నుండి బిల్లులు చెల్లించకుడా కూలిలుపోట్ట కోడుతుందని ఇప్పటి వరకు రాష్ట్రాల అజమాయిషీలో ఉన్న ఈ పథకం నిర్వహణ పూర్తిగా కేంద్రం చేతికి వెళ్లనుందని.ఇకపై పనుల కల్పన, అంచనాల ప్రక్రియను కేంద్రమే పర్యవేక్షించ నుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న పేర్కొన్నారు బుధవారం అయిన ఓ ప్రకటన విడుదల చేసారు,

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు 100 రోజుల ఉపాధికి గ్యారెంటీ కల్పించాలని, ఉన్న ఊళ్లోనే పనులు కల్పించాలనే డిమాండ్ల తో దేశవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు వామపక్ష ప్రజా సంఘాలు ఒత్తిడితో యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు దీనిపై 2005 లో చట్టం రూపొందించింది. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసిందని అన్నారు ఏపీఓ, ఎంపీడీఓలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి పనుల కల్పన నుంచి, బిల్లుల చెల్లింపుల వరకూ అన్నీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే నడిచేలా చర్యలు తీసుకుందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన లేబర్ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుందని అన్నారు. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తించి పనులు చేపట్టిన కూలీలకు కేంద్రమే నేరుగా బిల్లులు చెల్లిస్తుందని అన్నారు యుక్తధార మొబైల్ యాప్ వినియోగం ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు తోలి దశలో జిల్లా వ్యాప్తంగా మండలానికో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నారని తెలిపారు అనంతరం రెండో దశలో జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ దీనిని అమల్లోకి తెస్తుందని అన్నారు ఇప్పటికే రాష్ట్రంలో మోడల్ గ్రామాలగా ఎంచుకోని పనులు చేయిస్తుందని తెలిపారు, ప్రస్తుతం జిల్లాలో ఉపాధి పథకం ద్వారా కేటా ఇచ్చే మేటిరియల్ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు, ఇతర భవన నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు. ఈ యాప్ ద్వారా కేంద్ర పర్యవేక్షణ మొదలైతే భవిష్యత్తులో ఈ పనులన్నీ చేసే వీలుండదని అన్నారు.ఈపథకంలో పని చేస్తున్న ఉద్యోగులు ఎవరి పర్య వేక్షణలో విధులు నిర్వహించాలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏమిటనే ప్రశ్నలు తలెత్తు తున్నాయని తెలిపారు అయితే, అవినీతి నిర్మూలనకే ఈ యాప్ తెచ్చామని కేంద్రం గొప్పలు చెప్పుకుంటుందని తెలిపారు అవినీతి నిర్మూలించాలంటే దానికి తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలి, తప్ప కేంద్రం ఆధీనంలోకి తీసుకోవడ మేమిటని ప్రశ్నించారు. దీని వలన పనుల కల్పన పూర్తిగా తగ్గి పోతాయని తెలిపారు. ఈయాప్ వలన ఉపాధి హామీ పథకం పై రాష్ట్రాలు తమ హక్కులను పూర్తిగా కోల్పోవడం జరుగు తుందని అగ్రహారం వ్యక్తం చేసారు,ఇప్పటికే దేశవ్యాప్తంగా బిల్లులు చెల్లింపులు చేయక పోవడం నిదులు కోరత విదించడం వంటి చర్యలకు పూనుకుంటుందని తెలిపారు ఇప్పుడు కోత్త మెలుకవలు పెట్టి ఉపాధి ఉసురు తీయాలని చూస్తుందని వెంటనే పది వారాలుగా చెల్లించని భకాయిలు వెంటనే చెల్లించాలి దీనిపై కూలీలను ఎక్కడికక్కడ కూడా గట్టి పెద్ద ఎత్తున అందోళన చేస్తామని వెంకన్న స్పష్టం చేశారు.

# నాట్యమయూరాలు.. విద్యాకుసుమాలు



**ఎమ్మిగనూరు:** చదువు, నృత్యంలో బాలికలు రాణిస్తూ భళా అనిపించుకుంటున్నారు. పేదింటి బిడ్డలు వివిధ రాష్ట్రాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తూ పురస్కారాలు సొంతం చేసుకున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లోనూ ప్రతిభ కనబరిచారు.

**100 ప్రదర్శనలు.. 29 పురస్కారాలు**
**లావణ్య, ఎమ్మిగనూరు**

మా అమ్మానాన్న అరుణ, సురేశ్ కూలీ పనులు చేస్తారు. నాకు చదువుతోపాటు కూచిపూడి నృత్యమంటే ఎంతో ఇష్టం. పదో తరగతిలో 581 మార్కులు సాధించాను. ఐదేళ్ల నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నా. ప్రతిరోజూ రెండు గంటల సమయం కేటాయిస్తున్నా. జతులు, స్వరాలు, పదవర్ణాలు, పదస్వరాలపై ప్రావీణ్యం పొందుతున్నా. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల సమయం దగ్గరపడుతున్నా జనవరి, ఫిబ్రవరిలో హైదరాబాద్, బెంగళూరులో నిర్వహించిన జాతీయ నృత్య పోటీలకు హాజరై బహుమతి సాధించా. 2021లో హైదరాబాద్‌లో నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రతిభా పురస్కారం అందుకున్నా. అదే ఏడాది తెలుగు బుక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. 2021 మార్చిలో హంపిలో జరిగిన నృత్య ప్రదర్శనలోనూ పురస్కారం తీసుకున్నా. ఇప్పటి వరకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో 100 ప్రదర్శనలు ఇవ్వగా 29 చోట్ల ప్రతిభా పురస్కారాలు సొంతం చేసుకున్నా.

**చదువు.. నాట్యం.. రెండు కళ్లు**
**వర్ష, ఎమ్మిగనూరు**

మా అమ్మానాన్న అనురాధ, రవిచంద్ర కూలీ పనులు చేస్తుంటారు. చిన్నప్పటి నుంచి నృత్యంపై తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. పదో తరగతిలో 565 మార్కులు సాధించాను. నాకు చదువు, నృత్యం రెండు కళ్లు. ఆరేళ్ల నుంచి నృత్యంలో రాణిస్తున్నా. కూచిపూడిలో గణపతి స్తోత్రం, వినాయక, జతులు, స్వరాలు, శబ్దాలయ, తిలాన, సంకీర్తనాలు, ఆచార్య కీర్తనలు, పదవర్ణాలు, అష్టపదులు, భామాకలాపం తదితర వాటిపై ప్రదర్శనలిచ్చా. తిరుపతి, బళ్లారి, మంత్రాలయం, శ్రీశైలం, నంద్యాల, హైదరాబాద్, రాయచూరు, హంపీ, బెంగళూరులో నృత్య ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు అందుకున్నాను. 2019లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన పోటీల్లో, 2024, ఈ ఏడాది ఫిబ్రవరిలో రవీంద్రభారతిలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి నృత్య పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచా. ఇప్పటి వరకు 89 ప్రదర్శనలు ఇచ్చాను.

# తారు రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ శంకుస్థాపన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం అనునిత్యం కృషి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన 4వ జోన్ 30వ వార్డు పరిధిలోని రెల్లి వీధిలో సుమారు 71 లక్షల రూపాయలతో కలెక్టర్ ఆఫీస్ జంక్షన్ నుండి అంబేద్కర్ కళ్యాణమండపం వరకు జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న తారు రోడ్డు పునరుద్ధరించి నిర్మాణానికి దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పల రత్నం తో కలసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అనునిత్యం కృషి చేస్తుందని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా 30వ వార్డులో రూ.71 లక్షలు జీవీఎంసీ నిధులు వెచ్చించి తారు రోడ్డు పునరుద్ధరించి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అంచెలంచెలుగా చేపడతామని మేయర్ తెలిపారు.

అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, వార్డు సచివాలయం కార్యదర్శులు, పలువురు నాయకులు, నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే దేశం, ఒకే ఎన్నికల ప్రతిపాదన బిల్లు సమావేశం పాల్గొన్న ఎంపీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** ఒకే దేశం, ఒకే ఎన్నికల ప్రతిపాదనకు సంబంధించిన బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) స్టడీ విజిట్ లో భాగంగా మంగళవారం ముంబై నగరంలో జరిగిన రాజ్యాంగ (129 సవరణ) బిల్లు, 2024 పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశానికి కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) బిల్లు, 2024 సమావేశానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే, కమిటీ సభ్యులతో కలిసి అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ పాల్గొన్నారు.

# తల్లి రుణం తీర్చుకోలేనిది... - ఆంజనేయరెడ్డి



**కాకినాడ రూరల్ (విశాఖ సమాచారమ్):-** సేవరత్న అనపాల ఆంజనేయరెడ్డి తన తల్లి అనపాల అప్పల నరసమ్మ 26వ వర్ధంతిని పురస్కరించుకొని కాకినాడ రూరల్ మండలం ఏపీఐఐసీ మెయిన్ రోడ్ లో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనపాల ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ మా తల్లి అప్పలనరసమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా పేదలకు పాదచారులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదే విధంగా సుమారు 300 మందికి మా కుటుంబీకులు బాబురావు చంద్రకళ దంపతులు, సుమన్ గాయత్రీ దంపతులు, సంపత్ శైలు దంపతులు సహకారంతో భోజనాన్ని అందించమని అమ్మలేని లోటు ఎవరు తీర్చలేనిదని ఆమెను తలచుకుని ఏ పని చేసినా సక్రమంగా జరుగుతాయని ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు గౌరవించి వారు ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరద శ్రీనివాస్, పీవీఎస్ రెడ్డి, సతీష్, సాయి రాంబాబు, రాజు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధిపై సమీక్షా సమావేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** బుధవారం ఉదయం వివిఎంఆర్డీఏ కార్యాలయం తొమ్మిదవ ఫ్లోర్ నందు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పి .నారాయణ, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ. మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, వివిఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ లతో కలసి నగర అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు

ఈ సమీక్ష సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్, విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, వీఎమ్ఆర్డిఏ కమిషనర్ కె. ఎస్ విశ్వనాథన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సంపత్ కుమార్, ఏపీఈపీడీసీఎల్ ఎండి పృథ్వీ తేజ్, నగర మేయర్ పీలా శ్రీనివాస్, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ గణబాబు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్ రాజు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, అతిథి గజపతిరావు, లోకం మాధవి, కే లలిత కుమార్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిప్యూటీ మేయర్ గోవిందరాజు, జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# ఇదంతా 'పన్నా'గమే!!



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జీవీఎంసీ ఆధీనంలో ఉన్న విలువైన స్థలాలను పరిరక్షించాల్సిన అధికారుల్లో కొందరు.. అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు తార్కాణమే మధురవాడ పరిధిలోని రూ.5 కోట్ల విలువైన స్థలంపై నిర్లక్ష్యం. 'జీవీఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసే సమయానికి అది ఖాళీ స్థలం. దానిలో అనధికారికంగా నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు కళ్లు మూసుకున్నారా? కట్టిన దుకాణాలు అనధికారం అని తెలిసి పన్ను ఎలా విధించారు? ఆ పన్నులు పట్టుకుని న్యాయస్థానానికి వెళుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? న్యాయస్థానాల్లో కౌంటర్ దాఖలు చేయకుండా ఎందుకు వ్యవహరించారు?'... అంటే సమాధానాల్లేవు.

**సముదాయం నిర్మించినా..**

కారు షెడ్డు కూడలి నుంచి మిథిలాపురం కాలనీకి వెళ్లే మలుపులో సర్వే సంఖ్య 248/10లోని స్థలంలో ప్లాన్ అనుమతులకు దరఖాస్తు చేశారు. 1080 గజాల స్థలంలో జాతీయ రహదారి విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ వంటి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని 672 గజాలు జీవీఎంసీకి గిఫ్ట్‌డీడ్ చేయాలని అధికారులు సూచించారు. నూకరాజు జీవీఎంసీకి గిఫ్ట్ డీడ్ చేశాకే 408 గజాల్లో ప్లాన్‌కు అనుమతులిచ్చారు. అనుమతులు పొందిన స్థలంలో జీప్లస్-3 భవన నిర్మాణం చేశారు. గిఫ్ట్‌డీడ్ చేసిన నూకరాజు చెల్లెలు తనకు హక్కులున్నాయంటూ, తన తల్లి ఇచ్చినట్లు అన్‌రిజిష్టర్డ్ వీలునామాతో కోర్టును ఆశ్రయించారు. తర్వాత ఆ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించారు. అయితే..ఆ నిర్మాణాలకే జీవీఎంసీ అధికారులు పన్నులు విధించడం గమనార్హం.

జీవీఎంసీకి గిఫ్ట్‌డీడ్ ఇచ్చిన స్థలానికి విధించిన పన్ను ఇది. విచిత్రమేమంటే రసీదులో 2018 నుంచి 2023 వరకు రూ. 1.35 లక్షల బకాయిలున్నట్లు తెలుస్తుంది. అంటే అధికారులు ఐదేళ్లు పన్ను వసూళ్లకు ప్రయత్నమే చేయలేదా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**నాటి కమిషనర్ లేఖ**

'1955 సేల్‌డీడ్ ప్రకారం ప్లాన్‌కు దరఖాస్తు చేయగా, 672 గజాలు గిఫ్ట్‌డీడ్ తీసుకుని మిగిలిన స్థలానికి ప్లాన్ అనుమతులిచ్చాం. గిఫ్ట్‌డీడ్ తీసుకున్నప్పుడు అక్కడ ఖాళీ స్థలం ఉంది. స్థలానికి హక్కుదారుగా చెబుతున్న వ్యక్తి జీవీఎంసీ అనుమతి తీసుకుని నిర్మాణం చేపట్టాలి? ఆ దుకాణాలకు ఎలాంటి అనుమతుల్లేకుండా అనధికారికంగా నిర్మించారు. వీలునామా సరైంది కాదు. దుకాణాలు అనధికారికంగా కట్టారు కనుక స్టే ఎత్తి వేయాలి' అంటూ 2018లో అప్పటి కమిషనర్ హరినారాయణ కోర్టుకు తెలిపారు. ఈ కమిషనర్ బదిలీ అయ్యాక, కోర్టుకు ఎలాంటి నివేదికలివ్వకుండా, కౌంటర్ దాఖలు చేయకుండా అక్రమార్కులకు అధికారులే కొమ్ముకాశారన్న ఆరోపణలున్నాయి.

2nd pages111.qxd 5/21/2025 8:15 PM Page 7



# తల్లితో వివాహేతర సంబంధం

## కూతురితో పెళ్లి చేయాలని బెదిరింపు



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** తల్లితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె కుమార్తెపై కన్నేసి చంపుతానని బెదిరించాడో వ్యక్తి.

అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన మహిళకు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. 2016లో మహిళ భర్తచనిపోయాడు. భర్త చనిపోయిన 8 నెలలకు గ్రామానికి చెందిన పడాల నాగలక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ నాగిరెడ్డి పరిచయమయ్యాడు.

అది కాస్తా సహజీవనంగా మారింది. ఆ మహిళ పెద్ద కుమార్తె పదో తరగతి చదివే సమయంలో తనకిచ్చి పెళ్లి చేయాలంటూ ఒత్తిడి తీసుకురావడంతో తల్లీ కూతుళ్లు నాగిరెడ్డినిఇంటికి రాకుండా కట్టడి చేశారు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఇటీవల విడిపోయారు. అనంతరం తిరిగి పాతమహిళ వద్దకు చేరుకున్న నాగిరెడ్డి బీటెక్ చదువుతున్న పెద్ద కుమార్తెపై కన్నేశాడు. ఈ క్రమంలోయువతిపై దాడినిందితుడిపై కేసు నిందితుడ గత నెల 30న రాత్రి వారిఇంటికి వెళ్లి వివాహ విషయంపై గొడవ పెట్టుకుని తల్లి కూతురులను చిత్రహింసలకు గురిచేశాడు. యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పెళ్లి నాగిరెడ్డి చేయకపోతే ముగ్గురిని చంపుతానని బెదిరించడంతో తట్టు కోలేకపోయినబాధిత మహిళ 3రోజుల కిందట అనపర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరుకుటుంబాలను సోమవారం పోలీస్ స్టేషన్కు రావాలని చెప్పడంతో వారు వచ్చారు. నాగిరెడ్డి తల్లి భానుమతి యు వతిపై విరుచుకుపడిఆమె పీక పట్టుకుని కింద పడేసి దాడికి పాల్పడింది. అపస్మారక స్థితికి చేరుకున్న యువతినిఏరియా ఆసుపత్రికి తరలించడంతో చికిత్స అందించారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యం నిలకడగా ఉంది. తల్లీ కుమార్తెల ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

# దళితులపై పెరుగుతున్న దాడులు అరికట్టాలి

- ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్



**దేవరాపల్లి (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడుల ను అరికట్టి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. మండల కేంద్రం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద మంగళవారం అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ దళిత విద్యార్థి జేమ్స్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. బీటెక్ చదువుతున్న విద్యార్థి పై దాడి చేయడమే కాకుండా తాళ్లతో కట్టేసి అతను మూత్రం అతనకే తాగించి దుర్మార్గంగా వ్యవహరించిన కుల దురహంకారులపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని నక్కపల్లి మండలం డొంకాడ లో ఎనిమిది మంది దళిత యువకుల్ని చోరీకి పాల్పడ్డారన్న నెపంతో విచక్షణారహితంగా కొట్టి కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న దళితులపై దాడులు పరంపర కొనసాగుతూనే ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క వివక్ష లేదని చెప్పిన నాయకుల నియోజకవర్గంలోనే మరొకపక్క దళితుల్ని గ్రామ బహిష్కరణలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ఘటనలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా సంఘాలు, దళిత ఐక్య ఉద్యమాలతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం నాయకులు కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, మచ్చ రామారావు, కన్నాబత్తుల రాజు, పల్లా సంతోష్, మచ్చ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పంచముఖ ఆంజనేయ స్వామి వార్షికోత్సవలు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** నెల్లూరు జిల్లా జీ మాడుగుల మండలం గాంధీ నగరం లో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వార్షికోత్సవాలు గురువారం నుంచి స్థిర వారం వరకు ఘనంగా నిర్వహించనున్నారు. 22 తేదీ గురువారం తెల్లవారుజామున స్వామివారికి జల క్షీర పంచామృతా భిషేకం తో ఆలయం లో పూజలు ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ తెలిపారు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి 25 ఆదివారం ఉదయం ఎనిమిది గంటల శ్రీ హనుమ శోభాయాత్ర హనుమాన్ సేవాశ్రమం గాంధీ నగరం నుంచి మెయిన్ రోడ్ మీదుగా శ్రీ పాకలపాటి గురువు సన్నిధి. శ్రీ సీతారాముల ఆలయం మీదుగా హనుమాన్ ఆశ్రమం వరకు రామనామ కీర్తనలు కోలాటాలతో జరుగుతుందని కమిటీ తెలిపింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు మండలంలోని భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. . హనుమాన్ జయంతికి ముస్తాబు అవుతున్న ఆంజనేయస్వామి ఆలయాలు. మండలంలోని ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయ.కమిటీ లు ఏర్పాట్లు చేస్తున్నాయి. జి మాడుగుల మండలంలో 50 పైగా విగ్రహాలు ఆలయాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో భక్తులు యువకులు హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

# జాతీయ జెండాలు, దేశభక్తి నినాదాలతో మార్మోగిన తిరంగా యాత్ర

## టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకొని, భారత సాయుధ దళాల పట్ల పౌరుల కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరచే రాజకీయేతర ఉద్యమంగా దేశవ్యాప్తంగా చేపట్టిన తిరంగా యాత్ర ప్రజల్లో దేశభక్తిని రగిలిస్తోంది. ఈ నేపథ్యంలో నర్సీపట్నం నియోజకవర్గంలోని గొలుగొండ మండలం ఎల్లవరం లో బుధవారం ఆపరేషన్ సింధూర్ కు సంపూర్ణ మద్దతుగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు, ప్రజలు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ర్యాలీ అంతటా 'జై భారత్', 'వందే మాతరం' నినాదాలు మారుమోగాయి. అదేవిధంగా సింధూర్ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ, దేశాన్ని రక్షించే బాధ్యతను భుజాలపై వేసుకున్న నేతలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూటమిని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడి చేసిన ఘటనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆపరేషన్ సింధూర్' ద్వారా దీటైన సమాధానం ఇచ్చారన్నారు. పాకిస్థాన్ సైన్యం ఎన్ని కుట్రలు చేసినా భారత సైనికులు ధైర్యంగా ఎదిరించి పోరాడిన తీరును విజయ్ కొనియాడారు.

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరియు వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు ఈ యాత్ర నిర్వహించామన్నారు. సైనికుల రక్షణ నిధికి గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన వంతు సహకారం అందించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి పౌరుడు ముందుకు వచ్చి విరాళాలు ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చింతకాయల పద్మావతి, చింతకాయల రాజేష్, దనిమిరెడ్డి మధు, అడిగర్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా నిర్వహించిన నర్సీపట్నం తెదేపా మినీ మహానాడు

- హాజరైన 4వేల మంది కార్యకర్తలు
- ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తీర్మానం



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నంలో తెదేపా మినీ మహానాడు పండుగలా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి సుమారు 4,000 మందికి పైగా కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్యంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు భారతరత్న ప్రకటించాలనే తీర్మానాన్ని ఆమోదిస్తూ, ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు. ఈ సందర్భంగా తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తీర్మానించామని తెలిపారు. కార్యకర్తల అంకితభావమే తెలుగుదేశం పార్టీకి అసలైన బలమని పేర్కొన్నారు. గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడు పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీలోనే నిలకడగా కొనసాగుతున్నారని, తమ కుటుంబానికి అవినీతి రాజకీయాలకు సంబంధం లేదన్నదే ఆయన ధైర్యంగా మాట్లాడటానికి కారణమని ఆయన వివరించారు. చిన్నతనం నుండీ తెదేపా జెండాను చూసే పెరిగిన తాము, చివరి శ్వాస వరకు కూడా అదే పార్టీలో ఉంటామని విజయ్ వెల్లడించారు. నర్సీపట్నం అభివృద్ధికి గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిరంతరం శ్రమిస్తున్నారని, పది నెలల వ్యవధిలో 117 కోట్ల రూపాయలు నిధులను నియోజకవర్గానికి తీసుకురాగలిగారని, అంటే నెలకు సగటున 9 కోట్ల రూపాయలు తీసుకొచ్చిన ఘనత ఆయనదేనని కొనియాడారు. విద్య, వైద్య, మౌలిక వసతుల కల్పనలో నర్సీపట్నాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే కార్యకర్తలపై దాడులు చేస్తారన్న అర్థంలేని ప్రచారం జరుగుతోందని, అది పూర్తిగా అసత్యమన్నారు. గత పాలనలో లిక్కర్ రంగంలో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. పార్టీకి నిస్వార్థంగా సేవ చేసే కార్యకర్తలకు గుర్తింపు లభించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఫోటోలు ప్రతి కార్యక్రమంలో ఉండాలన్నారు. అనకాపల్లి జిల్లా తెదేపా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన కార్యకర్తలు ఉన్న నియోజకవర్గం నర్సీపట్నమేనని పేర్కొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 50 వేలకు పైగా సభ్యత్వాలను నమోదు చేశామని చెప్పారు. కార్యకర్తల త్యాగంతో పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిందని చెప్పారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియంత పాలనలో మాట్లాడే అవకాశం లేని సమయంలో, తెదేపా పార్టీకి పునర్వైభవం తీసుకువచ్చిన ఘనత స్పీకర్ అయ్యన్నపాత్రుడుదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో బూత్ స్థాయిలో మెజారిటీ సాధించిన ఇంచార్జులకు, పార్టీ కోసం పాటుపడిన సీనియర్ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. 80 ఏళ్ళు దాటి కూడా చురుకుగా పనిచేస్తున్న వారికి గౌరవ సన్మానాలు చేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తుంచుకుంటుందని చరిత్రలో ఇది మొదటిసారి కష్టపడ్డ కార్యకర్తని సన్మానించుకోవడం అని విజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డ్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, కాశీనాయుడు, నందిపల్లి వెంకటరమణ, ఎర్రాపాత్రుడు, అడిగర్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుకు పట్టం



**బొమ్మూరు:** ఎందరో పండితులను తీర్చిదిద్దిన బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి మంచిరోజులు రానున్నాయి. నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చొరవతో 1985లో 45 ఎకరాల విస్తీర్ణంలో సాహిత్య పీఠం, తెలుగు వర్సిటీ బొమ్మూరులో ఏర్పాటు చేశారు. ఎంఫిల్, పీహెచ్‌డీ తదితర కోర్సులు అందించేవారు. ఇందులో 25 ఎకరాలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడం వల్ల 20 ఎకరాలే మిగిలింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ప్రధాన కార్యాలయం తెలంగాణకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి పీఠం పరిస్థితి దయనీయంగా మారింది. డిమాండు ఉన్న ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను నిలుపుదల చేశారు. 2016, 2017లో ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ అందక ఇబ్బందులు పడ్డారు. 2019లో తెదేపా ప్రభుత్వం వర్సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఇంతలో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో పరిస్థితి మారలేదు.పీఠంలో 15 మంది బోధనేతర సిబ్బందిలో ముగ్గురు ఉద్యోగ విరమణ పొందారు. 2024-25లో అడ్మిషన్లు లేకపోవడంతో రెండో సంవత్సర విద్యార్థులు 11 మందే మే నెలలో ఆఖరి సెమిస్టర్ పరీక్షలు రాశారు.

వైకాపా నిర్లక్ష్యం: వైకాపా ప్రభుత్వం సాహిత్య పీఠంపై దృష్టిసారించలేదు. అప్పటి కలెక్టర్ తెలుగు యూనివర్సిటీలో భూముల ను ఇతర అవసరాల కోసం కేటాయించడానికి చర్యలు చేపట్టారు. తగినంత మంది విద్యార్థులు లేకపోవడంతో వర్సిటీకి 5 ఎకరాలు సరిపోతుందని ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. సాహితీ వేత్తలు సైతం ఈ విషయమై మండిపడ్డారు. దీనిపై విద్యావేత్తలు పెద్ద ఎత్తున పోరాటం చేయడంతో విరమించుకున్నారు.

**చిగురించిన ఆశలు**

కూటమి ప్రభుత్వం తెలుగు యూనివర్సిటీపై దృష్టి సారించింది. పీఠం పునరుద్ధరణ వల్ల వీసీ, ఇతర సిబ్బంది, దాదాపు 35 కోర్సులు, శాఖలు పెరగడం వల్ల పూర్వ వైభవం సంతరించుకనే అవకాశం ఉంది. 20 ఎకరాల్లో పాడుబడిన భవనాలు తొలగించి కొత్తవి నిర్మిస్తారు. ఎందరికో ఉద్యోగ అవకాశాలతోపాటు, విద్యార్థులకు, కళలకు పుట్టినిల్లుగా మారుతుందని సాహితీ వేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**పీఠానికి కొత్త కళ**

ఎన్టీఆర్ మానస పుత్రిక బొమ్మూరు తెలుగు విశ్వవిద్యాలయం. రెండు దశాబ్దాలుగా తెలుగు వైభవం పోయింది. పునరుద్ధరణ వల్ల తెలుగు భాష బతుకుతుంది. తెలుగు సాహిత్యం, సంస్కృతి ముందు తరాలకు అందించాలంటే యూనివర్సిటీ అవసరం ఎంతగానో ఉంది. కవులందరూ ఈ విషయమై హర్షం వ్యక్తం చేస్తున్నాం.

**డా.గూటం స్వామి, తెలుగు భాషాభివృద్ధి సమితి రాష్ట్ర అధ్యక్షుడు**

**కొత్త కోర్సులు అవసరం**

రాజమహేంద్రవరంలో తెలుగు అధ్యయన సంస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. గతంలో గరికపాటి నరసింహారావు ఇక్కడ పీహెచ్‌డీ పూర్తి చేశారు. బేతవోలు రాంబ్రహ్మం ఆచార్యులుగా పనిచేశారు. ఎందరో ఉద్దండ పండితులకు బొమ్మూరు సాహిత్య పీఠం పుట్టినిల్లుగా నిలిచింది. యువత కోసం, జర్నలిజం, హరికథ, నాట్యం, చిత్రలేఖనం, తదిరత కోర్సులు ఏర్పాటు చేస్తే తెలుగు భాష తరతరాలకు అందుతుంది.

**డా. బులుసు మూర్తి, కళా గౌతమి**

**ఇక మంచి జరుగుతుంది**

తెలుగుకు మంచి జరుగుతుందనే ఉద్దేశంతో ఇక్కడ సాహిత్య పీఠం స్థాపించారు. హైదరాబాద్ ప్రధాన కేంద్రంలో రకరకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ మాత్రం ఎంఏ తెలుగు సాహిత్యం మాత్రమే ఉంది. అన్ని విశ్వవిద్యాలయాల్లో తెలుగుపై ప్రభావం తగ్గింది. మీడియా రంగంలో తెలుగు ప్రాధాన్యత ఎంతగానో ఉంది.

**డా.చిలుకోటి కూర్మయ్య, విశ్రాంత తెలుగు అధ్యాపకుడు**

# వరుణుడి రాకతో ఉపశమనం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వేసవి ప్రారంభమైన నాటి నుంచి వేడి, ఉక్కపోతతో అల్లాడిన నగర ప్రజలకు వరుణుడు ఉపశమనం కలిగించాడు. మార్చి ప్రారంభం నుంచే ఎండలు మండిపోవడం, వాటికి తేమ తోడు కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతమై అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి జిల్లాలో పలుచోట్ల చల్లటి వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా విశాఖ గ్రామీణ మండలం సాగర్‌నగర్‌లో 75.5 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో వర్షపాతం వివరాలు ఇలా (మిల్లీమీటర్లలో): బీ విశాఖ వ్యాలీ స్కూల్ 70 బీ ఎండాడ 61.5 బీ హెచ్‌బీ కాలనీ 61.25 బీ ఆరిలోవ 59 బీ మహారాణిపేట 41.25 బీ కాపులుప్పాడ 38 బీ మధురవాడ 30.25.

# కిరాణా దుకాణంలో ఫ్రిజ్ తెరుస్తూ బాలుడి మృతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆనందపురం మండలం చందక గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో మంచినీటి కోసం ఫ్రిజ్ తెరిచిన ఓ బాలుడు విద్యుదాఘాతానికి మృతి చెందినట్లు సీఐ చింతా వాసునాయుడు వెల్లడించారు. ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం దొంతలవారి కళ్లాలకు చెందిన రెడ్డి శివ, లక్ష్మీకుమారికి దశ్వంత్(14), సంజయ్(12) సంతానం. వేసవి సెలవులు కావడంతో ఇద్దరు చిన్నారులు ఇంటి వద్దనే ఉంటున్నారు. పెద్ద కుమారుడు దశ్వంత్(14) ఆనందపురం ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం చందక కూడలిలో టిఫిన్ కోసం వెళ్లాడు. మంచినీటి కోసం టిఫిన్ సెంటర్ పక్కనే ఉన్న కిరాణా దుకాణంలోని ఫ్రిజ్ తెరిచాడు. అప్పటికే పడిన వర్షానికి ఫ్రిజ్ దెబ్బతిన్న విషయం తెలియక దశ్వంత్ తెరవడంతో విద్యుదాఘాతానికి గురై నేలపై పడిపోయాడు. దీంతో అతడిని వెంటనే మధురవాడ సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సిబ్బంది పరిశీలించి మృతి చెందాడని తెలిపారు. బాలుడి తండ్రి రెడ్డి శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుకాణంలో విద్యుత్తు ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టామన్నారు.

**ట్రాఫిక్ ఎస్ఐపై దౌర్జన్యం**

**గాజువాక:** విధి నిర్వహణలో ఉన్న గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ విజయకుమార్‌పై ద్విచక్రవాహనంపై వస్తున్న దంపతులు దౌర్జన్యానికి దిగడంతో గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అళహరి పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి బీసీరోడ్డులో డంక్ అండ్ డ్రైవ్ వాహన తనిఖీల్లో భాగంగా ఎస్ఐ తన సిబ్బందితో కేసులు రాస్తున్నారు.

ఇంతలో పెదగంట్యాడ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఎల్.ప్రసాద రావు, సాయిలక్ష్మీదేవిల వాహనాన్ని ఆపి రికార్డులు అడిగారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడానికి మీరెవరంటూ దురుసుగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించారని ఎస్ఐ విజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏ.పి.ఆర్.జే.సి ఫలితాలలో వీనస్ ఇనిస్ట్యూట్ విజయభేరి



**వి.మాడుగుల,(విశాఖ సమాచారమ్):** ఏపీ ఆర్ జె సి ఫలితాలలో మాడుగుల వీనస్ ఇన్స్టిట్యూట్ విజయభేరి మోగించిందని బుధవారం కరస్పాండెంట్ నాగ చంద్ర తెలిపారు.

ఏప్రిల్ 25వ తేదీన జరిగిన ఏ.పి.ఆర్.జే.సి ఫలితాలను విడుదల చేయగా మాడుగుల వీనస్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ నుంచి 27 మంది విద్యార్దులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచారు అని ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ తాళ్ళపురెడ్డి నాగ చంద్ర తెలియ చేశారు.ఏ. పి. ఆర్. జే. సి వొకేషనల్ లో రాష్ట్ర స్థాయిలో తాళ్ళవలస చందు 19వ ర్యాంక్, అప్పికొండ నవ్య శ్రీ 31వ ర్యాంకు, తాసిబిల్లి త్రిష 32 వ ర్యాంక్, దూడల వసంత 53 వ ర్యాంక్, నమ్మి యశ్వంత్ గణేష్ 57, పాము రఘు 67వ ర్యాంకు, దొండ సాయి హరి 71, కొంచెం శివ సంపత్ 81, బేరా దివ్య 84, పాత్రపల్లి ధనుష్ 89, ఏ. పి. ఆర్. జే. సి జనరల్ రాష్ట్ర స్థాయిలో వచ్చిన ర్యాంక్స్ , కిలపర్తి కేశవ 776, సాలది తులసి 923, సేనాపతి శాంతి 1056, పొలమరిశెట్టి జయశ్రీ 1506, ఆడారి ఉషశ్రీ 1597, పినబోయిన ప్రదీప్ చంద్ర 2640, జల్లు గుణ శ్రీ 2772, తూరు బిల్లి ధనుంజయ్ 2937, నాగోజి ఝాన్సీ 3713. బర్ల యశ్వంత్ 3907, గౌరీ పట్టపు సిరివర్షిని 4075, పాత్రపల్లి జ్ఞానేశ్వరి 4709, గొర్లి హేమ శృతి 5030, దూడల హేమంత్ 6937, ఆడారి లక్ష్మీ సంపత్ 8757, కోలిపిల్లి వైష్ణవి 9573, కర్రీ భరత్ వినయ్ 10158. రాష్ట్రస్థాయిలో ఇంత మంచి ర్యాంక్స్ తెచ్చుకున్న ఈ 27 మందికి శిక్షణ ఇవ్వడం ఎంతో గర్వంగా ఉందని తాళ్ళపురెడ్డి నాగచంద్ర తెలియ చేశారు. రాష్ట్రస్థాయిలో మన మాడుగుల మండలానికి ఇంత మంచి గుర్తింపు తెచ్చినందుకుగాను శ్రీనాధు శ్రీనివాసరావు( దేవరాపల్లి శ్రీను) , సర్పంచ్ఎడ్ల కళావతి , ఎంపీపీ తాళ్ళపురెడ్డి రాజారాం, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, గౌరీపట్టపు మహేష్ కుమార్ పిల్లలకు స్వీట్ తినిపించి అభినందించారు.

# క్రీడా సమాచారమ్

## ఐపీఎల్ నా జీవితాన్ని మార్చివేసింది: విప్రాజ్ నిగమ్



దిల్లీ: ఐపీఎల్ తన జీవితంలో చాలా మార్పులకు కారణమైందని దిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ అన్నాడు. క్రికెట్ దిగ్గజాలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వల్ల తన ఆట మెరుగవుతోందని ఆనందం వ్యక్తం చేశాడు. విప్రాజ్‌ను దిల్లీ క్యాపిటల్స్ రూ.50లక్షలు వెచ్చించి వేలంలో దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతో అతడు ఐపీఎల్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తున్నాడు.

'ఐపీఎల్‌తో నా జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లతో మైదానాన్ని పంచుకొని, వారి నుంచి ఆటలో మెళకువలు నేర్చుకునే అవకాశం లభిస్తోంది. దిల్లీ క్యాపిటల్స్ నన్ను ఎంపిక చేసినప్పుడు.. నా కోచ్‌లు, యాజమాన్యంతో చర్చించాను. లీగ్, దేశవాళీ క్రికెట్‌లో వారు నా బ్యాటింగ్‌ను చూశారు. నేను ఆల్ రౌండర్ పాత్ర పోషించాలని వారు ఎప్పుడూ నాకు చెబుతుండేవారు. అందుకే బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తున్నా' అని విప్రాజ్ అన్నాడు.

నేషనల్ క్రికెట్ అకాడమీకి వెళ్లి వచ్చిన తర్వాత తన ఆటలో వచ్చిన మార్పుల గురించి వివరించాడు. 'నేను ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత ముగ్గురు కోచ్‌లు నా ప్రగతికి కారణమయ్యారు. నేను నిజానికి బ్యాటర్‌గా వెళ్లాను. కానీ అక్కడ బ్యాటింగ్, బౌలింగ్ రెండూ ప్రాక్టీస్ చేశా. ఒక లెగ్ స్పిన్నర్‌గా బౌలింగ్‌ను సీరియస్‌గా తీసుకోమని వారు నాకు సూచించారు. నేను మొదట్లో పార్ట్‌టైమ్ బౌలర్‌గా కొన్ని ఓవర్లు బౌలింగ్ చేసేవాణ్ని. కానీ ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత నా ఆలోచన ధోరణి పూర్తిగా మారింది' అని విప్రాజ్ నిగమ్ చెప్పుకొచ్చాడు.

## నేనే ధోని అయితే తప్పుకునే వాడిని

### సంజయ్ బంగర్



స్పోర్ట్స్ డెస్క్: తానే ధోని అయితే.. ఇప్పటికే ఐపీఎల్ నుంచి తప్పుకొని ఉండేవాడినని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ అన్నాడు. గత కొన్నేళ్లుగా ఐపీఎల్ నుంచి ధోని రిటైర్‌మెంట్‌పై వార్తలు వస్తూనే ఉన్నాయి. రానున్న 2026 సీజన్‌లో తాను ఐపీఎల్ ఆడేది, లేనిదీ ఇంకా ఏ విషయమూ ధోని తేల్చి చెప్పలేదు. తానే ధోని స్థానంలో ఉంటే తగినంత క్రికెట్ ఆడి, ఫ్రాంఛైజీ ప్రయోజనాలు చూసుకున్న తర్వాత ఓ రోజు రిటైర్‌మెంట్ నిర్ణయం తీసుకుంటానని సంజయ్ బంగర్ అన్నాడు. అలాగే ధోని తన పర్యవేక్షణలోనే చెన్నై జట్టు పురోగతి సాధిస్తుందని భావిస్తుంటే వీడ్కోలు పలకడానికి అసలు సరైన సమయమే ఉండదని టీమ్‌ఇండియా మాజీ కోచ్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. తాను లేకపోయినా చెన్నై జట్టు దానంతట అదే ముందుకుసాగుతుందనే వాస్తవాన్ని ఎంఎస్ ధోని అంగీకరించాల్సి ఉంటుందన్నాడు.

'రిటైర్‌మెంట్ అనేది ఎంఎస్ ధోని నిర్ణయం మీదే ఆధారపడి ఉంటుంది. నేనే ధోని అయితే మాత్రం క్రికెట్ ఆడింది ఇక చాలని భావిస్తా. ఫ్రాంఛైజీ ప్రయోజనాలు కూడా నెరవేర్చాను కాబట్టి ఆటకు వీడ్కోలు చెబుతా' అని సంజయ్ బంగర్ అన్నాడు. 'జట్టులో మార్పు అనేది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. కాబట్టి రిటైర్‌మెంట్ తీసుకోవడానికి అనువైన సమయం అంటూ ఏదీ ఉండదు. తాను నిష్క్రమించినా ఫ్రాంఛైజీ అభివృద్ధి దానంతట అదే జరుగుతుందనే వాస్తవాన్ని గ్రహించాలి' అని సంజయ్ బంగర్ విశ్లేషించాడు.

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ప్రదర్శన సరిగా లేదు. 13 మ్యాచ్‌లు ఆడిన ధోని కూడా 135.17 స్ట్రైక్‌రేట్‌తో కేవలం 196 పరుగులు మాత్రమే చేశాడు. చాలాసార్లు ధోని లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఓ మ్యాచ్‌లో అయితే ఏకంగా తొమ్మిదో స్థానంలో బరిలోకి దిగాడు. మే 25న అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరగనున్న మ్యాచ్ ఈ సీజన్‌లో చెన్నైకి చివరిది.

## యువ ఆటగాళ్లు ఒత్తిడికి గురికావొద్దు: ఎంఎస్ ధోని




ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్ అనంతరం.. ఎంఎస్ ధోని యువ క్రికెటర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. రాజస్థాన్ 17.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ అనంతరం ధోని యువ క్రికెటర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చాడు.

'మీ మీద అంచనాలు పెరిగినప్పుడు ఒత్తిడికి గురికావొద్దు. సీనియర్ ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది నుంచి నేర్చుకోండి. యువ ఆటగాళ్లు 200 ప్లస్ స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేయాలనుకున్నప్పుడు, బ్యాటింగ్‌లో నిలకడ కొనసాగించడం కష్టమే. అయినా మ్యాచ్‌లో ఏ దశలో అయినా సిక్స్‌లు కొట్టగల సామర్థ్యం వారి సొంతం' అని మ్యాచ్ అనంతరం ధోని అన్నాడు.

అలాగే మ్యాచ్‌లో తమ టీమ్ ప్రదర్శన గురించి కూడా మాట్లాడాడు. 'మేం ప్రత్యర్థి జట్టు ముందు మంచి లక్ష్యమే ఉంచాం. కానీ మ్యాచ్ ఆరంభంలో త్వరత్వరగా వికెట్లు కోల్పోవడంతో లోయర్, మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి పడింది. బ్రెవిస్ చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. అతడు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు రన్‌రేట్ చక్కగా ఉంది. కానీ మేం మొదట్లోనే వికెట్లు కోల్పోవడంతో దాన్ని కొనసాగించలేకపోయాం. పేసర్ కాంబోజ్ చక్కగా బౌలింగ్ చేశాడు. మనం ఊహించిన దానికంటే అతడి బంతులు మనల్ని వేగంగా తాకుతాయి. పవర్‌ప్లేలో మూడు ఓవర్లు బౌలింగ్ చేయడమంటే అంత తేలిక కాదు. కానీ కాంబోజ్ బాగా బౌలింగ్ చేశాడు' అని ఎంఎస్ ధోని వివరించాడు.

చెన్నై సూపర్ కింగ్స్ మే 25న ఈ సీజన్‌లో తన చివరి మ్యాచ్ ఆడనుంది. అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఆ మ్యాచ్‌లో చెన్నై, గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. ఇందులో ధోని సేన నెగ్గి, విజయంతో సీజన్ ముగించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## వచ్చే సీజన్‌లో మరింత మెరుగై వస్తాం: సంజు శాంసన్



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్రయాణం ముగిసింది. తమ చివరి మ్యాచ్‌ను మంగళవారం దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆడింది. ఈ పోరులో రాజస్థాన్ రాయల్స్ ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. పది పరాజయాలు, నాలుగు విజయాలతో ఈ సీజన్‌ను రాజస్థాన్ ముగించింది. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజుశాంసన్ మాట్లాడాడు. 'మేం మరింత బాగా ఆడాల్సింది. ఇది అదృష్టానికి సంబంధించింది కాదు. మేం కొన్ని పొరపాట్లు చేశాం. తర్వాతి సీజన్‌కు మరింత మెరుగై వస్తాం. మా ఆటతీరుపై మేమంతా సమీక్షించుకుంటాం' అని శాంసన్ అన్నాడు.

అనంతరం తమ బౌలింగ్, బ్యాటింగ్ గురించి వివరించాడు. 'మా జట్టుకు మంచి యువ బౌలింగ్ లైనప్ ఉంది.

## అందానికి పట్టాభిషేకం.. 31 ఏళ్ల క్రితం ఫొటో షేర్ చేసిన సుస్మితాసేన్



**ఇంటర్నెట్ డెస్క్:** సరిగ్గా 31 ఏళ్ల క్రితం మే 21న ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నవేళ సుస్మితాసేన్ ) అందాల కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. భారత్ తరఫున తొలిసారి విశ్వసుందరి కిరీటాన్ని దక్కించుకొని చరిత్ర సృష్టించారు. అందుకే తన జీవితంలో మే 21 ఎప్పటికీ ప్రత్యేకమే అంటారు నటి సుస్మిత. నేడు మరోసారి ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

" భారతదేశానికి చెందిన 18 ఏళ్ల అమ్మాయిని విశ్వానికి పరిచయం చేసిన చరిత్రాత్మక విజయం అది. ఆశకు మరింత బలాన్నిస్తూ.. ప్రేమను మరింత ముందుకునడిపిన రోజు. ప్రపంచమంతా పర్యటించడానికి జీవితంలో స్ఫూర్తినింపే ఎంతోమంది వ్యక్తులను కలిసే భాగ్యాన్ని పొందిన రోజు. ఈ విషయంలో దేవుడికి, మా అమ్మకు ఎప్పటికీ కృతజ్ఞతలు చెబుతూనే ఉంటాను. మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం తొలిసారి విజయం సాధించి 31 ఏళ్లు అయింది. ఈ సందర్భంగా అందరికీ నా శుభాకాంక్షలు. నా దేశానికి ప్రాతినిధ్యం వహించే గౌరవం లభించినందుకు ఎప్పటికీ గర్వంగా ఉంటాను. పెద్ద కలలు కనండి.. వాటిని సాధ్యం చేసుకునేందుకు శ్రమించండి" అని పేర్కొన్నారు.

ఇక పోస్ట్ చూసిన అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు. ఆమెను ప్రశంసిస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'మీరు ఎప్పటికీ విశ్వసుందరే' , 'మీరు ఎంతోమందికి ఆదర్శం' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సుస్మిత షేర్ చేసిన ఫొటోలు మాత్రం ఇంటర్నెట్‌లో తెగ షేర్ అవుతున్నాయి.

## విశాఖ ఖ్యాతిని రెట్టింపు చేసేలా అంతర్జాతీయ యోగా వేడుకలు





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అంతర్జాతీయ స్థాయిలో విశేషమైన గుర్తింపు కలిగిన విశాఖ మహా నగరం ప్రాశస్త్యాన్ని, విశిష్టతను, ఖ్యాతిని రెట్టింపు చేసేలా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను అందరం కలిసి కట్టుగా నిర్వహిద్దామని, విజయవంతం చేద్దామని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం స్థానిక ఆర్కే బీచ్ వద్ద జరిగిన యోగాంధ్ర నెలావారీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లు వేపాడ చిరంజీవిరావు, గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఇతర అధికారులు భాగస్వామ్యమై యోగా విశిష్టతను, ఆవశ్యకతను తెలుపుతూ వివిధ ఆసనాలు వేశారు. దీనిలో భాగంగా ముందుగా అందరూ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తమ సందేశాలను అందించారు. అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవ వేడుకలో చిన్నారులు వేసిన ఆసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**విశాఖ వేదికగా ఈ వేడుక జరగటం గర్వకారణం : ఎమ్మెల్సీ చిరంజీవిరావు**

విశాఖపట్టణం వేదికగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగటం మనందరికీ గర్వకారణమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. 2015 నుంచి యోగాను అంతర్జాతీయ దినోత్సవంగా సుమారు 177 దేశాలు జరుపుకుంటున్నాయని, మద్దతు ఇస్తున్నాయని గుర్తు చేశారు. యోగా ఎన్నో మానసిక రుగ్మతలకు, సమస్యలకు విరుగుడులాంటిదని, అందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించడానికి దోహదపడుతుందని అన్నారు. దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జూన్ 21న జరిగే ఈ మహోత్తర కార్యక్రమాన్ని మనమంత కలిసికట్టుగా నిర్వహించి విజయవంతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఈ విజయం ఒక్క విశాఖకు, రాష్ట్రానికే కాదు దేశానికి ప్రపంచ స్థాయి రికార్డును అందిస్తుందని పేర్కొన్నారు.

**విశాఖకు ప్రపంచ పటంలో చెరిగిపోని ముద్ర సొంతం : గణబాబు**

ప్రపంచ నగరాల్లో విశాఖకు ఇప్పటికే ప్రత్యేక స్థానం ఉందని, జూన్ 21న జరగబోయే వేడుకల ద్వారా ప్రపంచ పటంలో ఈ నగరానికి చెరిగిపోని ముద్ర సొంతమవుతుందని ప్రభుత్వ విప్ గణబాబు పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోజూ యోగా చేస్తారని, అందుకే వారు ఆరోగ్యంగా ఉంటున్నారని, ఉదయం నుంచి రాత్రి ఉత్సాహంగా ఉంటారని, ప్రజలందరూ కూడా ఈ ప్రక్రియను అనుసరించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ యోగా వేడుకలకు విశాఖను వేదికగా చేసిన అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని గణబాబు అన్నారు.

**అందరినీ భాగస్వామ్యం చేస్తూ నెల రోజుల పాటు యోగా వేడుకలు : జిల్లా కలెక్టర్**

వేడుకను రికార్డు స్థాయిలో నిర్వహించేందుకు అందరినీ సిద్ధం చేస్తున్నామని, దీనిలో భాగంగా టీఓటీలకు, వారి ద్వారా మిగిలిన వారికి యోగా శిక్షణలు అందించేందుకు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ద్వారా సర్టిఫికేట్లు అందజేసేందుకు, తదుపరి ప్రక్రియలు నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేశామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజలంతా ఈ నెల రోజులు జరిగే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, అంతర్జాతీయ యోగా వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరూ యోగా ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ప్రజలు, వివిధ సంస్థలు, మీడియా సహకారంతో రికార్డును సొంతం చేసుకోగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు యోగా మంత్ లో భాగంగా శిక్షణలు, ప్రత్యేక యోగాలు.. జల యోగా, అంధులకు నిర్వహించే యోగా వంటి ప్రక్రియలు నిర్వహిస్తామని, స్వర్ణాంధ్ర లక్ష్యాల్లో భాగంగా హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**షెడ్యూల్ ఇలా....**

ఏమే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు మాసోత్సవాలు జరుగుతాయని, జూన్ 21న ప్రధాన కార్యక్రమం జరుగుతుందని, దానిలో దేశ ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ప్రముఖులు భాగస్వామ్యం అవుతారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందిని, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో సుమారు 5 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సాగర తీరంలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి, భోగాపుపురం మీదుగా శ్రీకాకుళం వరకు వేడుక సాగుతుందని వివరించారు. మే 21 నుంచి జూన్ 15 వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని, జూన్ 16 నుంచి 21వ తేదీ వరకు గుర్తించిన ప్రాంతాల్లో డెమానిస్ట్రేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. సాధారణ పరిపాలనా శాఖ అధికారులు, విద్యా, సచివాలయ, టూరిజం, ఐటీ, క్రీడా, ఆయూష్ తదితర ప్రముఖ శాఖల కీలక భాగస్వామ్యం ఉంటుందని వెల్లడించారు. ప్రత్యేక వెబ్ సైట్, యాప్ రూపొందించి అందుబాటులోకి తీసుకొస్తామని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుపుతామని వివరించారు. ప్రాథమిక దశలో అనగా మే 21 నుంచి 27వ తేదీ వరకు జిల్లాస్థాయిలో టీవోటీలను గుర్తించి శిక్షణ అందిస్తామని, 28వ తేదీ నుంచి మండల లెవెల్ లో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందని, జూన్ 04 నుంచి 16వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో శిక్షణలు అందిస్తామని కలెక్టర్ వివరించారు. మే 28 నుంచి జూన్ 03వ తేదీ వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని, దానిలో భాగంగా వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికేట్లు, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. జూన్ 16న ఫ్యామిలీ యోగా, 17న ప్రత్యేక యోగా, 18, 19వ తేదీల్లో ప్రత్యేక పోటీలు ఉంటాయని వివరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా జిల్లా, మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో కమిటీలు నియమించామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.

**యోగాంధ్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్**

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాల మేరకు 2025 జూన్ 21వ తేదీన విశాఖ నగరం వేదికగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు యోగాంధ్ర 2025 పేరున మే 21 నుండి 2025 జూన్ 21వ తేదీ వరకు విశాఖ నగరంలో యోగా కార్యక్రమాలు జరుగనున్న నేపథ్యంలో 2025 మే 21వ తేదీ బుధవారం ఆర్కే బీచ్ సమీపంలో విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల బహిరంగ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొని ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పీజీవిఆర్ నాయుడు, మండలి శాసనసభ్యులు వేపాడ చిరంజీవిరావు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, చైర్మన్ యోగాంధ్ర 20 25 ఎమ్ ఎన్ . హరేంధిర ప్రసాద్, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాక్చి, ఇతర జిల్లా అధికారులతో కలిసి మేయర్ యోగా క్రియలను చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు.







## బి.ఎన్.ఆర్ ఫౌండేషన్ లో ముగిసిన వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపు







**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** బి.ఎన్.ఆర్ భవనంలో గత 20 రోజులుగా జరుగుతున్న సమ్మర్ క్యాంప్ ను ఈ రోజుతో ముగించడం జరిగినది. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థిని విద్యార్థులు తమ యొక్క స్కిల్స్ ని ప్రదర్శించడమే కాకుండా అనేక విషయాలు మీద అవగాహన కల్పించుకోవడానికి ఈ సమ్మర్ క్యాంపు ఉపయోగపడింది అని పిల్లలు వారి తల్లిదండ్రులు కూడా చెప్పడం జరిగింది. ప్రధానంగా పిల్లలకు పూర్వకాలపు ఆటలు, మెమరీ గేమ్స్ ,కరాటే, డ్రాయింగ్, చెస్, పాటలు ,పద్యాలు ,కథలు, వీటితో పాటుగా నైతిక విలువల గురించి, క్రమశిక్షణగా ఎలా ఉండాలో కూడా తెలియజేయడం జరిగినది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిటైర్డ్ డిఎస్పీ గారైన రామ్ నాయుడు గారు హాజరై ఈ సమ్మర్ క్యాంపులో శిక్షణ ఇచ్చిన టీచర్స్ కు సన్మానం చేయడం జరిగినది. ఈ సమ్మర్ క్యాంపులో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవం కూడా చేయడం జరిగినది. అంతేగాకుండా ముగింపు సమావేశంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు అందరకు బిస్కెట్స్, పెన్నులు పంపిణీ చేయడం జరిగినది. ముఖ్యఅతిథి మాట్లాడుతూ బి.ఎన్.ఆర్ భవనంలో ఇన్ని రోజులపాటు ఎంతో ఓపికగా పిల్లలను చెడు అలవాటులకు గురి కాకుండా ప్రధానంగా సెల్ఫోన్ కు బానిస కాకుండా ఇన్ని అంశాల మీద మీరు చేస్తున్న కృషి అమోఘమైందని ప్రశంసించడం జరిగినది. ఈ కార్యక్రమానికి బిఎన్ఆర్ ఫౌండేషన్ ట్రస్టీలు బుజ్జి, ఎస్.అప్పలరాజు, పెంటకోట రామారావు, ఐద్వా సీనియర్ నాయకులు ఎం. సుజాత, మోహన్ రావు, శేషగిరి, జన విజ్ఞాన వేదిక, కృపావతి, లక్ష్మన్ రావు, వి.సి.సి కోఆర్డినేటరు పి.సతీష్, కృపావతి మొదలైన వారి ఆధ్వర్యంలో, సహకారంతో విజయవంతంగా జరిగింది.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com